ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 27 | సంచిక : 4 | డిసెంబర్ 2021




ఈ సంచికలో. . . .

సాధన గ్రంథం - భగవద్గీత .............................................. 2


సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 6

అక్షరమణమాల - ద్విపద 8 ........................................ 27

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



నీకు నిజంగా మోక్ష సుఖం కావాలంటే, నువ్వు విషానికి ఎంత దూరంగా ఉంటావో అలాగే బాహ్య విషయ చింతనకు అంత దూరంగా ఉండు. విషయాన్ని చింతిస్తూ ఉంటే ఆత్మ దొరుకుతుంది అని ఎప్పుడూ అనుకోవద్దు, ఎవరైతే ఆత్మను చింతిస్తున్నారో వారికి ఆత్మ దొరుకుతుంది.

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

# సాధన గ్రంథం - భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనముల నుండి సేకరణ)**

నాలుగు వేదాలలో అపారమైన జ్ఞానసంపద ఉంది. అది అంతా మనకోసం సమీక్షించి గీతలో భగవంతుడు చెప్పాడు. భక్తిమార్గం, ధ్యానమార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం, ఇలా అనేక మార్గములు చెప్పాడు. ఏ మార్గంలో ప్రయాణం చేసినా మోక్షం పొందవచ్చు. అన్ని మార్గములు సమన్వయం చేసుకొని ప్రయాణం చేసినా మోక్షం పొందవచ్చు.

మనందరినీ ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలకు తీసుకొని వెళ్లాలని భగవంతుని సంకల్పం. భగవద్గీత మనలను గైడ్ చేస్తుంది. దైనందిన జీవితంలో మనం ఎలా ఉండాలి, ఏ సంఘటన వచ్చినప్పుడు ఎలా ప్రవర్తించాలి, అని మనలను గైడ్ చేస్తుంది. జన్మ వచ్చాక మనకు శుభం వస్తుంది, అశుభం వస్తుంది. శుభం వచ్చినప్పుడు పొంగిపోతున్నారు అనుకోండి, అశుభం వచ్చినప్పుడు క్రుంగిపోతున్నారు అనుకోండి, ఆధ్యాత్మిక జీవితానికి మీరు పనికిరారు. సర్వకాల సర్వావస్థలలో ఎవడైతే తన బుద్ధిని సమానంగా ఉంచుకొంటున్నాడో, ప్రకృతి గుణాలకు ఎవడైతే అతీతంగా ఉంటున్నాడో, వాడు ఆధ్యాత్మిక జీవితానికి పనికి వస్తాడు. భగవంతుడు ఏ మాట చెప్పినా, ఏ శ్లోకం చెప్పినా, జీవకోటికి ఏ సందేశం ఇచ్చినా వాటి గమ్యం మోక్షానికి తీసుకొని వెళ్ళటమే.

భగవద్గీత మోక్షానికి తీసుకొని వెళ్ళటానికి గైడ్ బుక్. అటునుంచి ఇటు చెప్పినా, ఇటునుంచి అటు చెప్పిన, ఏది ఏ విధంగా చెప్పినా, తలుపు సందున పెట్టి నీ శరీరాన్ని నొక్కినట్లు, భగవంతుడు నీ మనస్సును నొక్కినా, ఆయన ఉద్దేశం ఏమిటి అంటే, నిన్ను మోక్షం దగ్గరికి తీసుకొని వెళ్ళటం, ఆయన స్వరూపాన్ని నీ చేత పొందింప చేయటమే అంతకంటే వేరే ప్రయోజనం ఏమీ లేదు.

**దంభో దర్పోభిమానశ్చ క్రోధః పారుష్యమేవచ**

**అజ్ఞానం చాభి జాతస్య పార్థ సంపదమాసురీమ్**

ఇప్పుడు రాక్షసగుణాలు అంటే అసురసంపద గురించి పరమాత్మ చెబుతున్నాడు. ఈ అసురసంపద ఇంచు మించుగా అందరి దగ్గర ఉంటాయి. ఇది ఎవరి గురించో

చెబుతున్నాడు అనుకోకండి పరమాత్మ మన గురించే చెబుతున్నాడు. దంభః దర్పః అభిమానం క్రోధం పారుష్యం అజ్ఞానం మొత్తం ఆరు చెప్పాడు. దంభః అంటే ఆడంబరం. కొంతమంది ఆడంబరంగా జీవిస్తారు. వాళ్ళు ధర్మం చేస్తూ ఉంటారు అయితే గొప్పల కోసం చేస్తారు కానీ దయ కలిగి చెయ్యరు. మీరు ఈ మోసాన్ని బాగా అర్థం చేసుకోవాలి. ఆడంబరం ఉన్నవాడు కూడా దానాలు చేస్తూ ఉంటాడు. ఎందుకు చేస్తాడండి భగవంతుడి ప్రీతి కోసం చెయ్యడు. అందరూ మనల్ని గొప్పగా చెప్పుకుంటున్నారా లేదా అని వాడి గొప్ప కోసం వాడి ఆడంబరం కోసం చూస్తాడు కానీ నీ సుఖాన్ని కోరి, పరమేశ్వరుడి ప్రీతి కోసం వాడు చెయ్యడు. పైగా ఆడంబరాల కోసం చేస్తున్నాడు. గొప్పల కోసం చేస్తున్నాడు. గొప్పలకు పోతే తిప్పలు వస్తాయి. ఈ ఆడంబరాలు మానేయండి. ఈ గొప్పల కోసం చేసేవాళ్ళు ఏమి చేస్తారు నీళ్ళు దొరకని చోట నుయ్యి తవ్వించరు, గంగానది పక్కన నుయ్యి తవ్విస్తారు. దర్పః దర్పం అంటే గర్వం, గర్వం ఉన్నవాడికి ఎలా ఉంటుంది అంటే అందరూ మనలని గౌరవిస్తున్నారా లేదా అందరూ మన వంక చూస్తున్నారా లేదా, అందరూ మన తెలివి తేటలను మెచ్చుకుంటున్నారా లేదా, అందరూ మనకి చప్పట్లు కొడుతున్నారా లేదా, ఇలా అనుకుంటారు. గర్వం ఉన్నవాళ్ళు అందరూ ఎలా ఉంటారు అంటే మనకి లోకం ఏమి చేసింది అని చూస్తూ ఉంటారు. ఈ ఊరిలో నేను ముప్ఫై ఏళ్ళ నుండి కాపురం ఉంటున్నాను ఈ ఊరు నాకు చేసిన ఉపకారం ఏమిటండి అన్నాడు ఒక పెద్ద మనిషి నా దగ్గర, పోనీ నిజమే ఊరు వాడికి ఏమి చెయ్యలేదు. ఊరికి వాడు ఏమి చేశాడు. వీళ్ళు అందరూ నాకు ఓట్లు వెయ్యలేదు అనే కోపమే కానండి ప్రజలకి వీడు ఏమి సేవ చేశాడు అనే ప్రశ్న వాడికి అక్కర్లేదు.

రమణమహర్షి చెప్పారండి అహంకారం ఉంటే అంతా ఉంది. అహంకారం లేకపోతే ఏదీ లేదు. రమణ స్వామి చెప్పారు అహంకారం ఉంటే నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను. లోకం ఉంది, ఈశ్వరుడు ఉన్నాడు. అహంకారం ఉంటే అన్నీ ఉన్నాయి. అహంకారం లేకపోతే నీకు ఏమీ లేదు. ఉన్నది ఒక్కటే వస్తువు, ఆత్మ. దానిని మర్చిపోవడం వల్ల ఇవన్నీ పుట్టాయి అన్నాడు.

అభిమానం - అభిమానం ఉన్న మనుషులు ఎలా ఉంటారు లోపల సరుకు తక్కువగా ఉంటుంది పైకేమో గొప్పగా జీవించాలి అని వాళ్ళు అనుకుంటారు. పైకి మనల్ని అందరూ గౌరవించాలి ఇలా అనుకుంటారు. లోపల చూస్తే ఏమి ఉండదు, నేను

హైదరాబాదు వెళ్ళి వాడి పని పూర్తి చేసి వచ్చేశాను అంటాడు. వాడి పని పూర్తి చేసేస్తే వాడితోనే చెప్పచ్చు కదండీ, నాతో ఎందుకు చెప్పటం. అంటే నేను మళ్ళీ వాడి అహంకారానికి మేత వెయ్యాలి.

క్రోధః అంటే కోపం ఈ కోపం అనే దానిని చాలా జాగ్రత్తగా మనం ఆలోచించుకోవాలి. మన అందరికీ కామం ఒక్కటే శత్రువు. ఇంక ఎవరూ శత్రువులు లేరు. మిగతా అన్ని దుర్గుణాలు అందులోనే పుడుతున్నాయి. ఈ కోపం ఎక్కడ నుంచి వచ్చింది కామం లోంచే వచ్చింది. కామం లేనివాడికి కోపం ఏమిటి, మనకి ఎవరి మీద అయినా కోపం వచ్చింది అనుకోండి ఆ పదినిమిషాలు మౌనంగా ఉండటం మంచిది లేకపోతే చెడ్డ మాటలు వచ్చేస్తాయి. కోపం వచ్చే కొలది రక్తపోటు పెరిగిపోతూ ఉంటుంది. మీరు ఎంత శాంతిగా ఉంటే మీ ఆరోగ్యం అంత బాగుంటుంది. ఈ లోకం గురించి రెండు మాటలు పరమాత్మ అన్నాడు. ఇది అనిత్యం, ఇది అసుఖం అన్నాడు. ఈ అనిత్యమైన ప్రపంచంలో, అసుఖమైన ప్రపంచంలో ప్రతీ జీవుడు కాలిపోతున్నాడు. దేనికి కాలిపోతున్నాడు? కామాన్ని, క్రోధాన్ని హృదయంలో దాచుకుని వాటిని బయటకి పంపలేక వాటిని నిరంతరం చింతిస్తూ కాలిపోతున్నాడు. పోనీ ఈ కామం, క్రోధం స్మశానంలో శరీరాలు కాలిపోయినప్పుడు కాలిపోతున్నాయా అంటే అక్కడ కాలవు. ఈ కామ క్రోధాలు కలిసి ఎక్కడ మనం శరీరం వెతుక్కుందాం అని చూస్తూ ఉంటాయి. ఈ కామ క్రోధాలు అనేవి ఈ ప్రకృతి లోంచి, ఈ మనస్సు లోంచి పుడుతున్నాయి కానీ మీలో ఉన్న నిజమైన ఆత్మ లోంచి మటుకి కామ క్రోధాలు పుట్టడం లేదు. ప్రకృతి లోంచే పుడుతున్నాయి కాబట్టి నువ్వు ప్రకృతిని జయిస్తే కామ క్రోధాలని జయించగలవు. ప్రకృతిని జయించక పోతే వీటిని జయించలేవు. అందుచేత ఈ కామ క్రోధాలు నీకు నిజమైన శత్రువులు. వాటిని తొలగిస్తే నీకు శాంతి వస్తుంది.

అజ్ఞానం - అజ్ఞానం పోతే ఇంతకుముందు చెప్పిన చెడ్డ గుణాలు అన్నీ పోతాయి. మనం ఏమి చేస్తున్నాం ఈ గుణాలను పోగొట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాం కానీ లోపల అజ్ఞానం ఉంచేసుకుంటున్నాం. అజ్ఞానం అనేది లోపల వేరు. వేరుతో సహా చెట్టుని బయటకి తీసినప్పుడు ఆ చెట్టు పోతుంది కానీ ఈ అజ్ఞానం అనేది లోపల ఉంచుకుని మిగతా చెడ్డ గుణాలని పోగొట్టుకొంటున్నా అజ్ఞానం మరల వాటిని సృష్టిస్తూ ఉంటుంది. అజ్ఞానం ఎవడైతే పోగొట్టు కుంటున్నాడో వాడు నా స్వరూపం పొందుతాడు అని పరమాత్మ చెప్పాడు. ఎవడైతే

అజ్ఞానం పోగొట్టుకుంటున్నాడో వాడే నా స్వరూపం పొందుతాడు. వాడే శాశ్వతమైన సుఖాన్ని పొందుతాడు. వాడే ఆత్మని తెలుసుకుంటాడు. జ్ఞానం, జ్ఞానం అంటే మాములు కాలేజీలో చదువుకునే చదువులు, ఇది జ్ఞానం కాదు. ఎవడైతే ఆత్మను తెలుసుకున్నాడో వాడు జ్ఞాని. నేను physics నేర్చుకున్నాను, నేను కెమిస్ట్రీ నేర్చుకున్నాను, నేను లెక్కలు నేర్చుకున్నాను, అంటే అవి భౌతిక విద్యలు, దానివల్ల పొట్ట వెళుతుంది కానీ మీకు ఆత్మ తెలియదు. సాధన చేసి ఆత్మని తెలుసుకోవడం వల్ల మీరు జన్మ రాహిత్యం పొందుతారు, శాశ్వతమైన మోక్షాన్ని పొందుతారు. అతిగా ఏ పని చెయ్యకండి. ఆహారంలో అతి పనికిరాదు. స్నేహాల్లో అతి పనికిరాదు. విహారంలో అతి పనికిరాదు. ఎందులోనూ అతిగా వెళ్ళద్దు. తగు మాత్రంగా జాగ్రత్తగా చెయ్యమని చెప్పాడు. ఇలా జీవిస్తూ ఉంటే మీరు సంసారంలో ఉన్నా మీకేమి ఇబ్బంది లేదు. సంసారం జ్ఞానం రాకుండా ఆపు చెయ్యదు. మీ మనసు ఆపు చేస్తుంది జ్ఞానం రాకుండా, సంసారం మీకు ఏమీ ఆపుచేయదు. మీ పనులు మీరు జాగ్రత్తగా చేసుకుంటూ భగవంతుడిని పొందడం కోసం మీరు నిరంతరం కృషి చెయ్యండి. మీరు నిరంతరం భగవంతుడిని స్మరిస్తూ ఉంటే మీ యోగ క్షేమాలు చూసే బాధ్యత ఆయనదే. మనం ఎవరం నిరంతరం స్మరించలేము. ఇప్పటి నుంచే మనం కష్టపడితే ఏదో ఒకజన్మలో వస్తుంది. ఒకటి మటుకి మర్చిపోవద్దు ఒక జన్మలోనే మీకు జ్ఞానం వచ్చి పడిపోదు. అయితే ఈ దేహంలో కొంత కృషి చేస్తే మళ్ళీ దేహంలో కొంత వస్తుంది. అలా నెమ్మది నెమ్మదిగా ప్రయత్నం చేసుకుంటూ వెళ్ళాలి. మనసుకి వికాసం వచ్చి, మనసు బాగా విశాలం అయితే తగిన యోగ్యత చూసుకుని ఈశ్వరుడు సడన్‌గా మనకి జ్ఞానం ఇచ్చేస్తాడు. అందుచేత మరీ మరీ మీకు చెప్పేది ఏమిటి అంటే ఏ పని చేసినా పరమేశ్వరుడి ప్రీతి కోసం మీరు చెయ్యండి. పరమేశ్వరుడు యొక్క అనుగ్రహం పొందడం కోసం మీరు చెయ్యండి. మీకు అసాధ్యం ఉండవచ్చు, నాకు అసాధ్యం ఉండవచ్చు కానీ పరమేశ్వరుడికి అసాధ్యం అంటూ ఈ లోకంలో ఏది లేదు. ఆయన నీలో ఉన్నాడు. శాశ్వతమైన శాంతిని, శాశ్వతమైన పదవిని, శాశ్వతమైన సుఖాన్ని మీరు పొందుతారని భగవంతుడు మీకు సద్బుద్ధిని ప్రసాదించి భౌతికంగా, ఆధ్యాత్మికంగా అన్ని రంగాలలో కూడా మీరు అభివృద్ధిలోకి రావాలని మీ అందరి యొక్క క్షేమం మరోసారి మరోసారి కోరుతూ మీ అందరి దగ్గర సెలవు తీసుకుంటున్నాను.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 13 జనవరి 1985, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ద్వైత ప్రపంచం కల్పితం అని ఆచార్యుల వారు చెబుతున్నారు. అది మనకి కల్పితంలా కనిపిస్తోందా? నిజంలా కనిపిస్తోందా? నిజంలాగే కనిపిస్తోంది. మనకి కామం వచ్చినా, క్రోధం వచ్చినా, రాగ ద్వేషాలు వచ్చినా, ద్వైత ప్రపంచంలో నుండే వస్తున్నాయి. మనం ద్వైత ప్రపంచం నిజం అని అనుకుంటున్నాం కాబట్టి లోపల అన్ని వికారాలు వస్తున్నాయి. ద్వైత ప్రపంచం అబద్ధం అని మన మనస్సు గుర్తించిన రోజున, మన మనసుకి అర్థమైన రోజున, మన మనస్సు బహిర్ముఖం అవ్వనే అవ్వదు. నా మనస్సు నిలబడటం లేదండి, నా మనస్సు బహిర్ముఖం అయిపోతోంది, నా మనస్సుని ఏకాగ్రం చెయ్యలేక పోతున్నాను, నా మనస్సుని అంతర్ముఖం చెయ్యలేక పోతున్నాను అని మనిషి చెప్పడానికి కారణం ఏమిటి అంటే ఈ ద్వైత ప్రపంచం నిజం అనుకోవటం. కానీ ఆచార్యుల వారు ఏమని చెబుతున్నారు అంటే ఇది కల్పితం అని చెబుతున్నారు.

ద్వైతం ఉన్నవాడికే లోకం, ద్వైతం ఉన్నవాడికే భోగం, ద్వైతం లేనివాడికి లోకం ఎక్కడుంది? ద్వైతం లేనివాడికి భోగం ఎక్కడుంది? మీకు లోకం అంటూ ఒకటి కనిపిస్తోంది కాబట్టి అందులో భోగం అనుభవిద్దాం అని ఉంటుంది. లోకమే లేనివాడికి భోగం ఏమిటి? ద్వైతమే లేనివాడికి భోగం ఏమిటి? ఇది మీరు బాగా అర్థం చేసుకోవాలి. ఈ శరీరం మనం అనుకుంటున్నాం కాబట్టి చచ్చిపోయిన తరువాత ఏమవుతాం అని ప్రశ్న వస్తుంది మనకి, చచ్చిపోయిన తరువాత ఏమవుతామో తెలుసుకోవచ్చు కానీ ఏమవుతామో తెలుసుకోవడం శుద్ధ దండుగ. నష్టం వచ్చే వ్యాపారం ఎటువంటిదో చచ్చిపోయిన తరువాత మనిషి ఏమవుతాడో తెలుసుకోవడం కూడా అటువంటిదే! ఆత్మ చచ్చిపోదు, చచ్చిపోయేది దేహం, తాను దేహం కాదు. తాను దేహం అయితే దేహం చచ్చిపోయినప్పుడు తాను చచ్చిపోతాడు అది కరెక్టే. ఈ సింపుల్ విషయం మీరు అర్థం చేసుకోండి. నేను దేహం అయితే దేహం చచ్చిపోయినప్పుడు నేను చచ్చిపోతాను అది యథార్థం. నేను దేహం కానప్పుడు దేహం చచ్చిపోయినప్పుడు నేను ఎలా చచ్చిపోతాను? ఈ ఒక్క వాక్యం మీ

మనసుకి పట్టాలి. ద్వైత ప్రపంచం అంతా దేహం మీదే ఆధారపడి ఉంటుంది. మీకు బంధువులు అని, స్నేహితులు అని, విరోధులు అని, రాగ ద్వేషాలు అని, భయం అని, ఇవన్నీ దేని మీద ఆధార పడ్డాయి? ద్వైతం మీదే ఆధారపడ్డాయి. చాలా మంచి ప్రశ్న తీసుకు వచ్చారు ఆచార్యులవారు.

సమస్త దుర్గుణాలకు ద్వైతమే కారణం. ద్వైతం మీరు యదార్థం అనుకుంటున్నారు కాబట్టి మనస్సు బహిర్ముఖం అవుతుంది. నేను దేహాన్ని అనుకుంటున్నాను కాబట్టి నాకు లోకం కనిపిస్తోంది. లోకం కనిపించినప్పుడు దేహం తోటి భోగం అనుభవించాలి అనిపిస్తుంది. చచ్చిపోయిన తరువాత మనిషి ఏమవుతాడు అని చాలామంది పెద్దలు దీని కోసం జీవితం ఖర్చు పెట్టారు. ఇది శుద్ధ దండుగ. ఎవరో ఒక వ్యక్తి పోయారు అనుకోండి, పోయిన వారు ఎక్కడున్నారో, ఏమిటో తెలుసుకుంటాం అనుకోండి, దానివల్ల కలిసి వచ్చేది ఏమిటి? వాళ్లకి ఉపకారం లేదు, మనకి ఉపకారం లేదు. మనకి ఒక వాసన వస్తుంది మళ్లీ మనం దాన్ని repeat చేస్తాం. ఆ వాసనని మనం బయటకు గెంటం. ఏ వాసన వస్తోందో దానిని రోజూ ఆచరించడం వల్ల అది బలపడుతుంది. మనం చేసే ప్రయాణాలు ఎలా ఉంటాయి అంటే ఒక పర్లాంగు లెక్క ముందుకు నడిచి మళ్లీ రెండు ఫర్లాంగులు వెనక్కి వస్తూ ఉంటాము. అంటే అప్పుడు ముందుకు నడుస్తున్నట్టా? వెనక్కి నడుస్తున్నట్టా? మనం చేసే సాధనలు అలా ఉంటాయి. ఏ వాసనలు అయితే మనం తొలగించుకోవాలి అని ప్రయత్నం చేస్తామో మనకి తెలియకుండానే వాటికి బలం చేకూరే పనులు చేస్తాము. అప్పుడు ఏమవుతుంది? మనం సాధన చేస్తున్నట్టా? లేకపోతే చేసిన సాధన పోగొట్టుకుంటున్నట్టా? మనం సత్యాన్ని దర్శించేవరకు మన ఇంద్రియాలని కానీ, మన మనస్సుని కానీ నమ్మటానికి వీలు లేదు. మరణించిన తరువాత ఏమవుతాం అని విచారణ చెయ్యటం కూడా ఒక మాయ.

ఏమీ లేదు చావు అంటే చొక్కా మార్చుకున్నట్టు. ఈ విషయం మీరు అర్థం చేసుకోండి. నేను తొడుక్కున్న చొక్కా మార్చటం ఎటువంటిదో చావు కూడా అటువంటిదే. ఈ విషయం మీకు అర్థం అవ్వాలి. చొక్కా మార్చడానికి, చావుకి ఏమీ తేడా లేదు. నేను నేను లాగే ఉంటాను నా చొక్కా మారుతుంది. అదే విధంగా నేను నేను లాగే ఉంటాను చావు వల్ల నా దేహం మారుతుంది. నిద్రకి, చావుకి ఒక పోలిక ఉంది. ఈ విషయం మీకు అర్థం అయితే

ఏమీ కంగారు పుట్టదు. మనిషి నిద్రపోయినపుడు ఎలా ఉంటాడో, మరణించిన తరువాత అలాగే ఉంటాడు. నిద్రపోయిన తరువాత గంటకి, రెండు గంటలకి కల ఎలా ప్రారంభం అవుతుందో, మళ్ళీ ఇంకొక కొత్త శరీరంలో వాడి జీవితం అలా ప్రారంభం అవుతుంది. నేను మరణించిన తరువాత నా అభివృద్ధి ఏమీ లేనప్పుడు మళ్ళీ శరీరం రావాలి, సాధన చేసుకోవాలి, నేను వాసనా క్షయం చేసుకోవాలి. ఈ లోపు మరణించిన తరువాత ఎక్కడ ఉన్నామో విచారణ చేసి తెలుసుకోవటం వల్ల ప్రయోజనం లేదు. పోనీ మరణించిన తరువాత ఏమిఅవుతామో తెలుసుకునే బదులు ఇప్పుడు నేను ఎవరిని? నువ్వు సత్యమైన నేను. మరణించిన తరువాత ఏమౌతాము అని తెలుసుకోవాలనుకొనేది అబద్ధమైన నేను.

మరణించిన తరువాత ఏమవుతామని తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్న ఈ నేను, అసలు నేనుని అంటే సత్యమైన నేనును తెలుసుకోవడానికి ఇప్పడు ఎందుకు ప్రయత్నం చెయ్యకూడదు? అలా చెయ్యటం లేదు. ఇదే మాయ! ఇప్పుడు మనం అందరం నేను నేను అంటున్నాం, భవిష్యత్తులో మన జీవితం ఎలా ఉంటుంది? మరణించిన తరువాత ఏమవుతాం? అని తెలుసుకోవడానికి ఈ నేను ప్రయత్నం చేస్తోంది. ఎందుచేత ప్రయత్నం చేస్తోంది? ఇది అబద్ధం కాబట్టి ఇంకొక అబద్ధాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తుంది. ఈ నేను అబద్ధం. ఇది కృత్రిమ నేను, ఇది రాగ ద్వేషాలతో కూడుకున్నది, ద్వైత ప్రపంచంలో సంచరించేది ఇదే. సత్యమైన నేను అంటే అది ఆత్మకి సంబంధించిన నేను. అది ఆత్మ నేను, ఇది కృత్రిమ నేను. అసలు నేను ఎప్పుడూ కూడా చచ్చిపోయిన తరువాత ఏమవుతామని ప్రశ్న అడగదు. ఎందుచేత? దానికి చావు లేదు కాబట్టి, కృత్రిమ నేను ఈ శరీరం నేను అనుకుంటోంది కాబట్టి ఈ శరీరం మరణించినపుడు తాను మరణిస్తున్నాను అని అనుకుంటోంది కాబట్టి మరణించిన తరువాత ఏమవుతామనే ప్రశ్న కృత్రిమ నేనుకి వస్తుంది. ఇప్పుడు మనం అనుకునే నేనుకి ద్వైత ప్రపంచం కనిపిస్తోంది. ఈ నేనుకే రాగద్వేషాలు వస్తున్నాయి, ఈ నేనుకే కామక్రోధాలు వస్తున్నాయి, ఈ



**నీ సుఖానికి దేహం మీద కాని, బాహ్యమైన విషయముల మీదగాని, వ్యక్తుల మీదగాని ఆధారపడకుండా నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు మీద ఆధారపడి ఉన్నప్పడు నీకు ఆత్మ నిష్ఠ కలుగుతుంది. అప్పడు వేరుబుద్ధి నశించి, నీకు మోక్షం కలుగుతుంది.**

నేనుకే ఇష్టాయిష్టాలు వస్తున్నాయి, ఈ నేనుకే హెచ్చు తగ్గులు వస్తున్నాయి, ఈ నేనుకే శరీరాలు వస్తున్నాయి, ఈ నేనుకే శరీరాలు పడిపోతున్నాయి. ఈ నేను ఆ నిజమైన నేనుని తెలుసుకునే వరకు మనం చొక్కాలు మార్చుకున్నట్టు దేహాలు మార్చుకుంటుంది. ఈ విషయం మీకు అర్థం అవ్వాలి. ఈ కృత్రిమ నేను రాముడిని గురించి తెలుసుకోమంటుంది, కృష్ణుడిని గురించి తెలుసుకోమని చెబుతుంది, మరణించిన తరువాత ఏమవుతాం తెలుసుకోమని చెబుతుంది. మళ్ళీ ఏ లోకం వస్తుందో తెలుసుకోమని చెప్తుంది. మరణించిన తరువాత మంచిలోకం వస్తుంది అనుకోండి అది అబద్ధం. చెడ్డ లోకం వస్తుంది అనుకోండి అదీ అబద్ధం. ఇది అబద్ధం కాబట్టి అబద్ధాల కోసమే ప్రయత్నం చేస్తుంది. ఈ నేనుని దాని యొక్క పుట్టినిల్లు అయిన నిజమైన నేను దగ్గరకు పంపించడానికి ఎవడైతే ప్రయత్నం చేస్తున్నాడో, వాడే నిజమైన గురువు, వాడే ఆత్మ, వాడే ఈశ్వరుడు. అదే అనుగ్రహం. ఇది బాగా జ్ఞాపకం ఉంచుకోండి.

మీకు ఏమైనా కోరికలు నెరవేరవచ్చు. మంచి మంచి లోకాలు రావచ్చు. ఆ లోకాలు ఎంతకాలం ఉంటాయి? మీకు నెరవేరిన కోరికలు ఎంతకాలం ఉంటాయి? ఇది ఈశ్వర అనుగ్రహానికి గుర్తు కాదు. ఏది గుర్తు అంటే మీ లోపల ఉన్న ఆత్మని తెలుసుకోవాలనే బుద్ధి మీకు అంటే కృత్రిమ నేనుకి కలుగుతుంటే భగవంతుడి అనుగ్రహం మీ మీద ఉన్నట్టే. లేకపోతే లేనట్టే! ఒకవేళ నిజంగా మీకు మంచి జన్మ వస్తుంది అనుకోండి. మంచి జన్మ ఎటువంటిది అంటే మంచి కల లాంటిది. రాత్రి మనం పడుకున్నాం అనుకోండి, చాలా మంచి కల వచ్చింది అనుకోండి, రేపు చాలా మంచి కల వచ్చింది అనుకుంటాం. మళ్ళీ ఆ కల గురించి ఆలోచిస్తామా? లేదు. మంచి జన్మ కూడా అటువంటిదే. చెడ్డ జన్మ ఎటువంటిది అంటే చెడ్డ కల లాంటిది.

ఈ కృత్రిమనేను ఎంతసేపు మరణాంతర జీవితం గురించి ఆలోచిస్తుంది కానీ, ఇప్పుడు ఉన్నటువంటి అసలైన జీవితం గురించి, యదార్థమైన జీవితం గురించి ఆలోచించడానికి ప్రయత్నం చెయ్యదు. ఈ నేనుకి సమన్వయము చెయ్యటం చేతకాదు. మనుషులు ఏమి చెయ్యాలి అంటే జీవితాన్ని సమన్వయము చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యాలి. మీరు జీవితాన్ని ఒక్క కోణం లోంచే చూడకూడదు. జీవితాన్ని బహుముఖంగా చూడాలి. జాగ్రత్తగా సమన్వయం చేసుకుంటూ ఎదరకి వెళ్ళాలి. దీనికి నా మొదటి మాట, చివరి మాట ఏమిటి అంటే మీకు ఎక్కువ ధైర్యం ఉండాలి. భయస్తుడికి, బద్ధకస్తుడికి మటుకి యదార్థమైన నేను తెలియదు.

ప్రతీ దానికి skill ఉండాలి. ఆపరేషన్ చెయ్యాలి అంటే ఎంతో కొంత నేర్పు ఉండాలి. వంట చెయ్యాలి అంటే ఎంతో కొంత నేర్పు ఉండాలి. వంటకే ఇంత నేర్పు కావలసి వచ్చినప్పుడు, ఒక ఆపరేషన్ చెయ్యడానికి ఇంత నేర్పు కావలసి వచ్చినప్పుడు, మనలో ఉన్న నిజమైన నేనుని తెలుసుకోవడానికి ఎంత నేర్పు ఉండాలి? అందుచేత మనకు నేర్పు ఉండాలి, ఓర్పు ఉండాలి. యథార్థం మన హృదయంలో ప్రకాశిస్తోంది. దానికి చావు తోటి నిమిత్తం లేదు. సత్యమైన నేనుకి చావుతో నిమిత్తం లేదు. అది మనమేఅని భగవంతుడు చెబుతుంటే చచ్చిపోయిన తరువాత ఏమవుతాం అని ప్రశ్న ఏమిటి? ఇది మీరు బాగా అర్థం చేసుకోండి. యధార్థమైన ఆత్మకి మరణం లేదని చెబుతున్నాడు. యధార్థమైన ఆత్మకి మరణం లేదని భగవంతుడు చెబుతుంటే, మళ్ళీ మరణించిన మనం ఏమవుతామని ప్రశ్న ఏమిటి? ఆ ప్రశ్న తప్పు, ఇదంతా మనసు చేసే మాయ.

నిజమైన నేను మనకు తెలియాలి అంటే మనకు ధైర్యం ఉండాలి, వినయం ఉండాలి, మనసు యొక్క స్వాతంత్ర్యం పోగొట్టుకోకూడదు. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. మీలో ఎవరైనా మనసు యొక్క స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకున్నారు అంటే అప్పుడు యధార్థమైన నేను తెలియదు. పతంజలి ఒక ఋషి, ఆయన యోగ శాస్త్రం రాశాడు. ఆయన ఏమి చెప్పాడు అంటే ఎవరు ఏది ఇచ్చినా మీరు పుచ్చుకోవద్దు అని చెప్పాడు. దానికి కారణం ఏమిటి అంటే, నేను మీకొక పది రూపాయలు ఇస్తాను అనుకోండి, నేను పది రూపాయలు మీకు ఇచ్చి మర్చిపోతే ఫర్వాలేదు. నేను మీకు పది రూపాయలు ఇచ్చి మీ మనసు మీద పెత్తనం చెయ్యడానికి చూస్తాను. లోకంలో జరిగే దానాలు ఇటువంటివే. నేను పది రూపాయలు మీకు ఇస్తాను, మీరు జీవితం పొడవునా నాకు అనుకూలంగా, అణుకువగా ఉండాలి అని నేను అనుకుంటాను. అప్పుడు ఏమవుతుంది? మీ మనస్సు యొక్క స్వాతంత్ర్యం చచ్చిపోతుంది. మిమ్మల్ని స్వతంత్ర్యంగా నేను ఆలోచించుకోనివ్వను. మీరు స్వతంత్ర్యంగా ఎప్పుడైతే ఆలోచించుకోలేరో మీలో ఉన్న నిజమైన నేను మీకు ఎలా తెలుస్తుంది? మన మనస్సుకి ఎప్పుడైతే స్వాతంత్ర్యం పోయిందో ఇది ఆత్మ వైపు ప్రయాణం చేయదు. అందుచేత ఏమిటి? మనం ఎదుటి వాడికి ఏదైనా ఇచ్చినా ఫరవాలేదు. ఎదుటివాడి మనసు యొక్క స్వాతంత్ర్యాన్ని పోగొట్టకూడదు. ఎదుటి వాడి దగ్గర మనం పుచ్చుకున్నప్పుడు మన స్వాతంత్ర్యాన్ని వాడు పోగొడతాడు అనుకున్నప్పుడు వాడి దగ్గర మనం పుచ్చుకోకూడదు. ఈ క్లూ మీరు బాగా అర్థం చేసుకోవాలి. ఎదుటివాడి దగ్గర మీరు పుచ్చుకున్నా ఫరవాలేదు వాడికి ఇచ్చి

మర్చిపోగల శక్తి ఉంటే. మీకు ఏదైనా వస్తువు ఇచ్చి, మీ మనస్సు యొక్క స్వాతంత్ర్యాన్ని పోగొట్టడానికి ప్రయత్నం చేస్తే ఆ దానం మంచిది కాదు. ఎందుకు మంచిది కాదు? పరిగ్రహం పనికిరాదు అన్నాడు పతంజలి. ఎందుకు పనికిరాదు? మన మనస్సు మీద పెత్తనం చేసే వాళ్ళ దగ్గర మనం పుచ్చుకోకూడదు. మనం ఒకవేళ ఎదుటివాళ్లకు ఎవరికైనా ఇస్తే వాళ్ళ మనస్సు మీద మనం పెత్తనం చెయ్యడానికి ప్రయత్నం చెయ్యకూడదు. వాళ్ళనిస్వతంత్ర్యంగా ఉంచాలి. వాళ్ళనిస్వతంత్ర్యంగా ఆలోచించుకోనివ్వాలి. మనం చేసేది చెయ్యాలి. అందుచేత దానం ఎలా ఉండాలి అంటే మనం ఇచ్చిన వెంటనే మర్చిపోవాలి. మీరు ఎదుటివాళ్ళ దగ్గర ఎవరి దగ్గరైన పుచ్చుకున్నారు అనుకోండి మాటవరసకి, వాళ్ళు కూడా ఇచ్చిన వెంటనే మర్చిపోయేలా ఉంటే మీరు పుచ్చుకున్నా దానివల్ల మీకు నష్టం లేదు, లేకపోతే మనస్సు పాడవుతుంది. అంటే స్వతంత్ర్యంగా ఆలోచించుకోనివ్వాలి, స్వతంత్ర్యంగా మనిషి ఆలోచిస్తే వాడికి దారి కనిపిస్తుంది.

ద్వైత ప్రపంచం కల్పితం అని ఆచార్యుల వారు చెబుతున్నారు. ద్వైత ప్రపంచం మనం నిజం అని అనుకుంటున్నాం. ద్వైత ప్రపంచం కల్పితం అన్న సంగతి మన హృదయానికి అర్థం అయితే భయం పుట్టదు. ఎంతకాలం అయితే మన హృదయానికి అర్థం అవ్వదో అంతకాలం ఎన్ని శాస్త్రాలు చదివినా భయం వేస్తూ ఉంటుంది. మీ హృదయంలో ప్రకాశిస్తున్నటువంటి సత్యాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నం మానేసి, లోకం గొడవలు, పరలోకం గొడవలు, మరణించిన తరువాత ఏమిటి ఈ గొడవలు మీరు పెట్టుకుంటే కోటి జన్మలు ఎత్తినా మీకు నిజం తెలియదు. మీరు పుణ్య కర్మలు చేస్తే మంచి జన్మలు రావచ్చు, పాపకర్మలు చేస్తే చెడ్డ జన్మలు రావచ్చు, అదీ స్వప్నమే, ఇదీ స్వప్నమే. మీ సంసారాలు బాగా వెళ్ళిపోతున్నాయి అనుకోండి, మీ బిడ్డలు మంచివాళ్ళు, మీ అత్తగారు, మీ మామగారు మంచివాళ్ళు, మీ భర్త మంచివాడు, మీకు చేతిలో డబ్బు ఉంది. మీకు అన్ని విధాలా బాగుంది అనుకోండి ఎంతకాలం ఉంటారు? ఏమైనా కోటి సంవత్సరాలు ఇక్కడ ఉంటారా? మీలో సంసారంలో ఇబ్బంది పడేవాళ్ళు ఉన్నారు అనుకోండి, ఈ ఇబ్బందుల తోటి మీరు ఈ దేహంలో కోటి సంవత్సరాలు ఉంటారా? అదీ స్వప్నమే, ఇదీ స్వప్నమే.

మనస్సులో త్యాగం లేనివాడికి జ్ఞానం రాదు. భగవాన్ ఏమన్నారు అంటే నువ్వు ఇచ్చే ఉప్పు పప్పు త్యాగం ఏమిటయ్యా? నీకు ఏది ఇష్టం? నీకు అన్నిటికంటే నీ అహంకారమే

ప్రీతి. దానిని త్యాగం చెయ్యి, అదొక్కటే త్యాగం అంటే, నీ డబ్బు త్యాగం చేసినా నీకు జ్ఞానం రాదు. నీ దగ్గర వస్తువులు త్యాగం చేసినా రాదు. అహంకారాన్ని ఎవడైతే త్యాగం చేస్తున్నాడో వాడు జ్ఞాని అవుతాడు అని చెప్పాడు భగవంతుడు. మీ గురించి మేము బెంగ పెట్టుకున్నాము అని కొంతమంది అంటారు. ఈ బెంగ పెట్టుకునే వాడు ఎవడు? ఎవడి గురించి వీడు బెంగ పెట్టుకుంటున్నాడు? రామచంద్రరాజుగారి గురించి నేను బెంగ పెట్టుకున్నాను అనుకోండి మాట వరసకి, రామచంద్రరాజు గారి గురించి ఇక్కడ బెంగ పెట్టుకునేవాడు ఎవడు? ఎవడి గురించి వీడు బెంగ పడుతున్నాడు? ఇదే ద్వైతం.

వశిష్టుడు ఏమి చెప్పాడు అంటే మీకు విషయం కనుక అర్థం అయితే చెట్టున ఉన్న పువ్వు కొయ్యటంకంటే తేలిక అన్నాడు ఆత్మ తెలియటం. ఒక చెట్టున పువ్వు కొయ్యటంకంటే తేలిక అంట ఆత్మ తెలియటం. పువ్వు కొయ్యటానికి కొంత కష్టపడాలి, ముందు ఆ చెట్టు దగ్గరకి వెళ్ళాలి, చెయ్యి పైకి పెట్టాలి, ఆ పువ్వు కొయ్యాలి. కొంత కష్టం ఉండచ్చు కానీ ఆత్మ సిద్ధంగా ఉంది. వడ్డించిన విస్తరిలాగా ఇక్కడ సిద్ధంగా ఉంది. నేను చెప్పే మాటలు మీకు అబద్ధంగా అనిపిస్తున్నాయి అనుకోండి నాకు ఏమీ అనిపించదు. ఎందుచేత? వాటిని అబద్ధంగా అనుకోవాలి అని మీరు అనుకుంటున్నారా? మీ వాసన యొక్క వేగం ఎక్కువగా ఉండటం వలన నా ప్రభావం కంటే మీ వాసన యొక్క ప్రభావం ఎక్కువ ఉన్నప్పుడు అది అబద్ధం కింద మీ మనస్సుకి అనిపిస్తుంది. అది మీ వాసనలో దోషం కానీ మీలో దోషం కాదు. మీరు ఆత్మే.

మీ ఇంట్లో ఎర్ర చీమలు తిరుగుతున్నాయా? అవి ఎప్పుడైనా విశ్రాంతిగా కూర్చోవటం మీరు చూశారా? ఏ బెల్లం ముక్క దగ్గరకో, పంచదార దగ్గరకో, ఏవండీ ఎక్కడికో ఒక



**ఈశ్వర సంకల్పమునకు భిన్నంగా ఒక్క అంగుళం కూడా అటు, ఇటు కదపలేవు. జరిగేది అంతా "ఈశ్వర సంకల్పమే". ఈ సృష్టిలో ప్రతి సంఘటన ఈశ్వర సంకల్పం ప్రకారం నడుస్తోంది అని నీకు అర్థమైతే, ఇప్పుడే ఈ క్షణంలోనే నీ దుఃఖం నశిస్తుంది.**

చోటుకి పాపం అలా తిరుగుతూనే ఉంటాయి. మనం ఆగమంటే ఆగవు. అది చిన్న ప్రాణి. అది కూడా గురువే మనకి. ఎందుచేత? అది మన వంక చూడదు దాని పని అది చేసుకుంటూ వెళ్ళిపోతూ ఉంటుంది. అలాచేసుకుపోవాలి మనం కూడా, ఎర్ర చీమని గురువుగా పెట్టుకోండి. దానిని గురువుగా పెట్టుకుని మీరు ఆత్మని తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యండి. ఎక్కడో ఆ కొబ్బరి చెట్టు దగ్గర పంచదార ఉంది అనుకోండి ఇక్కడ ఎర్ర చీమ ఉంది అనుకోండి అది దూరం అని మానేయదు. వాసనను బట్టి నెమ్మదిగా పాకి వెళుతూ ఉంటుంది. పోనీ ఒక గంటో, నాలుగు గంటలో ఆలస్యం అవుతుంది. నెమ్మది నెమ్మదిగా పాకుతూ వెళుతుంది. అంత ఓర్పుగా మనం ప్రయత్నం చేస్తే ఆత్మ తెలుస్తుంది. మైసూరు పాకం పంచదార తోటే చేస్తారు, పాల బిళ్ళ పంచదార తోటే చేస్తారు, లడ్డు పంచదార తోటే చేస్తారు. కానీ ఒకడికి లడ్డు ఇష్టం, ఒకడికి మైసూరు పాక్ ఇష్టం, ఒకడికి పాలబిళ్ళలు ఇష్టం. కానీ అన్నింటిలో ఉన్నది పంచదారే. అలాగే ఒకొక్కడికి ఒకొక్క దేవుడు అంటే ఇష్టం. అందరూ ఒక్కటే అందరిలో ఉన్నది ఆత్మే. దాని గురించి పేచీలు పడక్కర్లేదు. ఆ పేచీలలో మనం పడతాం అనుకోండి అది కూడా మాయే. ఆ పేచీలు కూడా సృష్టించేది అబద్ధమే.

ఒకసారి మద్రాసు మీటింగ్‌లో జవహర్‌లాల్ నెహ్రూ ఏమన్నాడు అంటే రాజగోపాలాచారి నాకంటే ముసలివాడే కాదు, నాకంటే తెలివైనవాడు కూడా. నాకంటే వయసులో మీరు పెద్దవాడు అనుకుంటున్నారు రాజగోపాలాచారి వయసులో కూడా పెద్దవాడే అంతేకాదు నాకంటే తెలివిగల వాడు కూడా, not only older, he is wiser than me. ఆయన కళ్ళతోటి ప్రపంచం అంతా చూస్తాడు. ప్రపంచానికి మటుకి ఆయన హృదయంలో ఏముందో తెలియ నివ్వడు. అంత తెలివిగలవాడు. రాజగోపాలాచారి స్నేహాలు గురించి ఏమని చెప్పాడు అంటే మన ఊరిలో చెరువు ఉంది అనుకోండి అందులో ఒక బెడ్డ వేసినా ఫరవాలేదు. చిన్న చిన్న గుంటలు ఉన్నాయి అనుకోండి అందులో ఒక బెడ్డ వేస్తే పైన ఉన్న తేట నీరు పోతుంది, కింద ఉన్న బురద పైకి లేస్తుంది. అదే విధంగా ప్రకృతి మనుషుల తోటి మనం స్నేహం చేస్తే ఉన్న భక్తి ఊడిపోయి లోపలున్న మట్టి పైకి లేచినట్టు ప్రకృతి గొడవలు బయటకి వస్తాయి. ఉన్నది చెడిపోతుంది అని చెప్పారు.

రమణమహర్షి, రామకృష్ణపరమహంస, వివేకానంద లాంటివాళ్ళు ఎవరితో స్నేహాలు చేసినా ఫరవాలేదు. ఎందుచేత వాళ్ళు సముద్రం లాంటి వాళ్ళు, మనం చిన్న చిన్న గుంటలం.

అంటే తక్కువ నీళ్ళు ఉన్నాయి ఇక్కడ, అసలే తక్కువ నీళ్ళు పైన తేటనీరు కొంచెం ఉంది అందులో ఎవడో వచ్చి బెడ్డ వేస్తే, ఆ తేట నీరు అంతా పోతుంది, కింద బురద బయటకి వస్తుంది. జాగ్రత్తగా భక్తిని అభివృద్ధి చేసుకునే ప్రయత్నంలో మనం ఉంటే, ఈ స్నేహాలు విషయంలో జాగ్రత్తగా లేకపోతే ఉన్నది ఊడిపోతుంది అని చెప్పారు. అంటే కొండనాలుకకి మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్టు.

రాధాకృష్ణ జయంతి రోజు ఉపాధ్యాయుల దినోత్సవం. నెహ్రూ జన్మదినం ఏమో బాలల దినోత్సవం అని ఎలా పెట్టారో, వివేకానంద జయంతిని యువజన దినోత్సవంగా గవర్నమెంటు ప్రకటించింది. ఆయన ముప్పై తొమ్మిది సంవత్సరాల ఎనిమిది నెలలు జీవించారు అంతే. కానీ లోకం మీద ఎంతో ప్రభావం చూపించారు? అందమైన వాడు అని, బాగా తెలివైన వాడు అని, లేకపోతే బిఎ చదువుకున్నాడు అని కాదు. ఈ రహస్యం మీరు ఆలోచించండి. సామాన్య మానవుడు మొదలు మహాత్మా గాంధీ గారి మనస్సు మీద కూడా ఆయన ప్రభావం చూపించారు. ఎందుచేత? బిఎ చదువుకున్నాడు అని చూపించాడా? ఏమిటి ఆయనలోని విశేషం? వివేకానంద చెప్పిన మాటలు మీరు చెప్పచ్చు కానీ ఎందుకు నిలబడటం లేదు? కోట్లాది మంది మీద ఆయన ప్రభావం ఈనాటికి కూడా ఎందుకు ఉంది? కారణం ఏమిటి? ఒకటే కారణం మనిషిలో స్వార్థం లేదు. మనిషి స్వార్థం లేకుండా కనుక జీవిస్తే వాడి ప్రభావం మానవ జాతి మీద ఉంటుంది. లేకపోతే ఇవాళ శరీరం పోయింది అనుకోండి రేపు ఏమి ఉండదు.

దేహం మరణించినపుడు దేహం కనుక నేను అయితే నేను కూడా మరణిస్తాను. దేహం నేను కానప్పుడు, దేహం మరణించినప్పుడు నేను ఎలా మరణిస్తాను? ఆత్మకి దేహం తోటి పని లేదు. ఎవరికి దేహం కావాలి? నాలో ఉన్న కోరికకి దేహం కావాలి. మీరు చిన్న పని చెయ్యనివ్వండి, పెద్ద పని చెయ్యనివ్వండి, ఇదంతా నేను చేస్తున్నాను, నేను కర్తను అనే భావన మీరు పెట్టుకుని చేస్తే మంచికి మంచి, చెడ్డకి చెడ్డ, ఎత్తుకి ఎత్తు వడ్డీతో సహా అనుభవించాలి. నేను అనే తలంపు లేకుండా చేస్తే మీరు ఏ పని చేసినా, పుణ్యం చెయ్యండి, పాపం చెయ్యండి, ఏదీ నిన్ను అంటదు. నేను అనే తలంపు తోటి చేశారా చిన్న పని చెయ్యండి, పెద్ద పని చెయ్యండి, తప్పనిసరిగా అంటుకుంటుంది. మీరు ఎన్ని వేల జన్మలు ఎత్తినా ఆ ఫలితం మీ కూడా ప్రయాణం చేస్తుంది. అదే ఉపనిషత్తులలో కూడా చెప్పారు

అక్కడ వంద ఆవులు ఉంటే దూడని విడిచి పెట్టేస్తే ఆ దూడ వంద ఆవులు దగ్గరకి వెళ్లదు, దాని తల్లి ఏదో దానికి తెలుసు. ఆ ఆవు దగ్గరకి వెళ్తే అది పాలు కుడుచుకుంటుంది. అదే విధంగా మీరు చేసే కర్మ మంచి అవ్వనివ్వండి, చెడ్డ అవ్వనివ్వండి, కోటి జన్మలలో కూడా మీరు ఏ శరీరంలో ఉన్నారో తెలుసుకుని మీ దగ్గరకు వస్తుంది.

మనకు నిద్రలో ఏమీ దుఃఖం లేదు, మెలకువ రాగానే దుఃఖం వస్తుంది. కారణం ద్వైత ప్రపంచం. నిద్రలో మీకు సుఖం ఉంది. అందుచేత నిద్ర రాకపోతే బిళ్లలు మింగుతున్నారు నిద్ర కోసం, మరి నిద్రలో ఉన్న సుఖం మెలకువ రాగానే మీకు పోతోంది కదా, జాగ్రదావస్థలో అది పోతోంది కదా, ఎందుచేత పోతోంది? ఆ సుఖం ఇప్పుడు ఉంది కదా, ఎందుకు పోతోంది? దానికి ద్వైత ప్రపంచం కారణం. ద్వైత ప్రపంచం కల్పితం అని ఆచార్యుల వారు చెబుతున్నారు. ఆచార్యుల వారు చెప్పింది నిజమే కాబట్టి ద్వైత ప్రపంచం కల్పితం కాబట్టి అందులోంచి దుఃఖం వస్తుంది. లోకమే కనుక నిజం అయితే అందులోంచి మనకి దుఃఖం రావడానికి అవకాశం లేదు సుఖమే రావాలి. నేను ఈ రోజున ఒక మాట చెబుతున్నాను. మీరు జ్ఞాపకం ఉంచుకోండి. మీరు మనసు చిక్కబడకుండా చూసుకోండి ఇంకేమి అక్కర్లేదు. మీ మనస్సు కనుక చిక్కబడితే మీకు దారే కనపడదు. మనస్సు ఆరోజుకారోజు పలచబడాలి. పలచబడితే మీకు దారి కనిపిస్తుంది. మనసు కనుక చిక్కగా ఉంటే అసలు దారే కనపడదు. మీరు ఎల్లమ్మ గొడవ, పుల్లమ్మ గొడవ, ఆ ఊరి గొడవ, ఈ ఊరి గొడవ, ఆ దేవుడి గొడవ, ఈ దేవుడి గొడవ, ఆ మతం గొడవ, ఈ మతం గొడవ మీదవేసుకుని మిమ్మల్ని మీరు వదిలేసి లోకం గొడవలు కనుక మీద వేసుకుంటే, మనసు అలా చిక్కబడిపోతూ ఉంటుంది. చిక్కబడిన ఆ మనస్సు పలుచబడాలి అంటే మళ్ళీ కొన్ని వేల జన్మలుపడుతుంది.

భారతం, రామాయణం అంటే ఏమీ లేదు. ధర్మానికి - అధర్మానికి, సత్యానికి - అసత్యానికి, న్యాయానికి - అన్యాయానికి, నిత్యానికి - అనిత్యానికి జరిగిన పోరాటమే రామాయణం. అలా జరిగిన పోరాటమే భారతం. అది మన హృదయంలో జరుగుతుంది. రామాయణం మన హృదయంలో జరుగుతుంది, భారతం మన హృదయంలో జరుగుతుంది. మనకి మంచి తలంపులు ఉన్నాయి, చెడ్డ తలంపులు ఉన్నాయి, మంచి కోరికలు ఉన్నాయి, చెడ్డ కోరికలు ఉన్నాయి. అయితే ఒకొక్కసారి మంచి కోరికల బలం పెరుగుతూ ఉంటుంది,

ఒకొక్కసారి చెడ్డ కోరికల బలం పెరుగుతూ ఉంటుంది. మనలోని చెడ్డ కోరికలే కౌరవులు, మనలోని మంచి కోరికలే పాండవులు. ఆ కురుక్షేత్రంలో జరిగిన యుద్ధమే ఇక్కడ రోజూ మనలో జరుగుతుంది. మీరు గనుక మీలో ఉన్న చెడ్డ కోరికలకి ప్రాముఖ్యత ఇవ్వకుండా, మీలో ఉన్న మంచి కోరికలకి ప్రాముఖ్యత ఇస్తే పాండవులకి భగవంతుడి సహాయం ఎలా ఉందో, అలాగే మంచిని పెంచుకోవడానికి మీరు ప్రయత్నం చేస్తుంటే మీకు భగవంతుడు సహాయం చేస్తాడు. అంటే మీకు వచ్చే ఆలోచనల విషయంలో, మీరు చేసే పని విషయంలో, మనస్సు పలుచబడాలి. మనసు పలుచబడితేనే కానీ ఇంద్రియాలు స్వాధీనంలోకి రావు. భగవంతుడు చెప్పిన మాటలు, ఆచార్య స్వాముల వారు చెప్పిన మాటలు ప్రతీ అక్షరం నిజం. అందులో ఏది మనం అబద్ధం అని అనుకుంటున్నప్పటికీ అది మన బుద్ధిలో దోషం. వాళ్ళు ఏదో ఊహించి చెప్పలేదు, దర్శించి చెప్పారు.

ఇప్పుడు మనం జిన్నూరులో ఉండి జిన్నూరు అనే ఊరు లేదు అసలు, జిన్నూరు అనే ఊరే అబద్ధం అనుకోవటం ఎటువంటిదో, ఆచార్యుల వారు చెప్పిన మాటలు అబద్ధం అనుకోవటం కూడా అటువంటిదే. ఎందుచేత? వాళ్ళు చూసి చెబుతున్నారు. నేను కాశీ చూసి వచ్చాను అనుకోండి, మీరు అందరూ కలిసి కాశీ అనేది లేదు అని తీర్మానం చేస్తారు అనుకోండి నేనేమైనా కంగారు పడతానా? అయ్యబాబోయ్ ఇంతమంది చెబుతున్నారు ఒకవేళ లేదేమో అని నేను అనుకుంటానా? అనుకోను. ఎందుచేత నేను చూశాను కాబట్టి. అదే విధంగా రమణస్వామి, ఆచార్యులవారు ఆత్మని దర్శించారు. ఈ లోకం అంతా ఆత్మ లేదనుకున్నా వాళ్ళు ఏమీ కంగారు పడరు. ఎందుచేత? ఈ లోకం ఏమిమాట్లాడుతుందో వాళ్ళకి తెలుసు. వాళ్ళు ఊహించలేదు. ఊహిస్తే కంగారు పడతారు. వాళ్ళు ఊహించింది కాదు దర్శించింది. దర్శించిన మూలాన ఋషి అయ్యారు.

**కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే ఈశ్వరుడు మీకు పరమ సుఖం ప్రసాదిస్తాడు.**



మన సాధన ఎందుకండీ? మనస్సు పలుచబడడానికి. కానీ మనం ఏమి చేస్తున్నాం అంటే చిక్కబడేలా చేసుకుంటున్నాం. మనసు చిక్కబడితే నిజం తెలియదు. సత్యం దర్శనం అవ్వదు. మనం సత్యాన్ని కోరుకుంటున్నాం, కానీ సత్యం మనల్ని కూడా కోరుకోవాలి. ఈ పాయింట్ మీకు అర్థం అవ్వాలి. దేవుడిని మనం అందరం కోరుకుంటున్నాం. కానీ ఆయన తెలియబడడు. దేవుడు కూడా అనుకోవాలి మనకి తెలియబడాలి అని, అప్పుడు మనకి తెలుస్తాడు. మేము సాధన చేస్తున్నాము, మేము సాధన చేస్తున్నాము అంటూ కొంతమంది గర్వం పెంచుకొంటారు. అటువంటి వారికి తెలియబడాలి అని అసలు అనుకోడు. మీరు చేసే సాధన మీకే జ్ఞాపకం ఉండకూడదు. మనసు పలుచబడే కొలది మీరు పక్వానికి వస్తారు, అరటిపళ్ళు ముగ్గేస్తే పక్వానికి వస్తాయి చూడండి. అలా మన మనస్సు పక్వానికి రావాలి, మన మనస్సు పక్వానికి వస్తేనే కానీ ఈశ్వర అనుగ్రహం పొందడానికి మనం అర్హులం కాదు. ఈశ్వరుడు అంటే అనుగ్రహమే.

ద్వైత ప్రపంచం అంతా అబద్ధం కాబట్టి, అసత్యం కాబట్టి మనకి దుఃఖం వస్తుంది. ఈ ద్వైత ప్రపంచం నిద్రలో లేదు కాబట్టి సుఖంగా ఉన్నాం. వీడు మంచివాడు అంటున్నాం అంటే మనసులోదే, వీడు చెడ్డవాడు అంటున్నాం అదీ మనసులోదే. మీరు ఆత్మని విడిచి పెట్టి, సత్యాన్ని విడిచి పెట్టి, దేనిని సాధించినా, దేనిని తెలుసుకున్నా, అది విద్య అవ్వనివ్వండి, డబ్బు అవ్వనివ్వండి ఏదైనా సరే, ఆత్మ తప్పించి మీరు దేనిని పొందినా స్వప్నంతో సమానం. అది మీకు బాగా హృదయానికి నాటితేనే కానీ మీ మనసు ఆత్మ వైపుకి తిరగదు. ఒక్క ఆత్మ తప్పించి ఏది attain చేసినా సరే, అది dreamతో సమానం. ఎందుచేత dreamతో సమానం? అది నిజం కాదు కాబట్టి, చదువే నిజం అనుకోండి చదువుకున్న వాడు ప్రతీవాడికి శాంతి ఉండాలి. మీరు బాగా అర్థం చేసుకోండి విషయాన్ని, ఇప్పుడు మనం చదువుకునే చదువులే కనుక నిజం అయితే చదువుకున్న ప్రతీ వాడికి శాంతిగా ఉండాలి. డబ్బే కనుక నిజమైతే డబ్బు ఉన్న వాడు ప్రతీ వాడికి శాంతిగా ఉండాలి. కీర్తే కనుక నిజం అయితే కీర్తి ఉన్న ప్రతీవాడు శాంతిగా ఉండాలి. కానీ ఎవడికీ శాంతి లేదు. ఇక్కడ మీరు గ్రహించవలసినది ఏమిటి అంటే నాకు చదువు ఉందండి, నా చదువు నా మనస్సుని నిగ్రహించటానికి ఎందుకు సహాయం చెయ్యడం లేదు? నా ధనం నా మనస్సుని నిగ్రహించడానికి ఎందుకు సహాయం చెయ్యడం లేదు? నాకున్న కీర్తి నా మనస్సుని నిగ్రహించుకోవడానికి సహాయం చేస్తుందా? నా మనస్సు చిక్కబడడానికి సహాయం చేస్తుందా నా కీర్తి? ఇవన్నీ బరువులు. కీర్తి కూడా బరువే.

మీరు అన్నీ కొత్తకొత్తవి కొనుక్కుంటారు కదా, గుడ్డలు కొత్తవి కొనుక్కుంటారు, గాజులు కొత్తవి కొనుక్కుంటారు, బజారులో వస్తువులు కొత్త వస్తువులు కొనుక్కోవాలని ఉంటుంది. ఆత్మ ఏమీ కొత్తది కాదు, అది ఎప్పుడూ ఉందది. ఎప్పుడూ ఉండేదానికి కొత్త ఏమిటి? కొత్తగా వచ్చింది అంటే అది నిజం కాదు. అది ఎప్పుడూ మనలో ఉంది, కొత్త ఏమిటి అసలు? మనకి తెలియనప్పుడు ఉంది, తెలుసున్నప్పుడు ఉంది. అయితే అది తెలియనప్పుడు మనలో ఉన్నప్పటికీ దుఃఖం వస్తుంది కాబట్టి దానిని తెలుసుకోవాలి అంతే. మనకి తెలియనప్పుడు కూడా అది అక్కడే ఉంది. కొత్త అనుకోకండి, మీకు తెలిసినప్పుడు అది కొత్తగా అనిపించినా అది కొత్త కాదు. మీకు తెలిసినప్పుడు అనిపిస్తుంది ఇన్ని జన్మల నుంచి అది మన కూడానే ఉంది, ఇంతవరకు మనకు అది తెలియలేదు అని, పైగా దేహం ఉన్నప్పుడు ఎలా ఉంటుందో, దేహం పోయినప్పుడు అలాగే ఉంటుంది ఆత్మ. దేహం ఉండడానికి, దేహం ఊడిపోవడానికి ఏమీ సంబంధం లేదు. దేహం ఉండచ్చు, ఊడిపోవచ్చు, దాని ప్రభావం జ్ఞాని మీద ఏమి ఉండదు. ఎందుచేతనంటే తాను ఆత్మ అయ్యి ఉన్నాడు కాబట్టి.

ఆత్మకి, దేహానికి అణుమాత్రం కూడా సంబంధం లేదని చెప్పారు భగవాన్. అయితే జన్మాంతరంలో మనం చేసిన కర్మను బట్టి, అంటే పనిని బట్టి, దేహం నల్ల దేహం రావచ్చు, ఎర్ర దేహం రావచ్చు, తెల్ల దేహం రావచ్చు, లావు దేహం రావచ్చు, సన్న దేహం రావచ్చు. కొంతమంది దేహాలు ఆరోగ్యంగా ఉండచ్చు, కొంతమంది దేహాలు ఎప్పుడూ అనారోగ్యంగా ఉండచ్చు. ఎప్పుడూ అనారోగ్యంగా ఉంటారు వందేళ్ళుబ్రతుకుతారు కొంతమంది. కొంతమంది ఎప్పుడూ ఆరోగ్యంగా ఉంటారు ఎప్పుడో సడన్ గా రోగం వస్తుంది యాభై ఏళ్ళకి, నలభై ఏళ్ళకి చచ్చిపోయే వాళ్ళు ఉన్నారు. దీనికి కారణం ఏమిటి? జన్మాంతరాలలో కర్మ యొక్క ఫలితం.

మీరు ప్రతీరోజూ చూసుకోవాల్సింది ఏమిటి అంటే రాత్రి మీరు పడుకునేటప్పుడు ఒక ఐదు నిమిషాలు ప్రార్థన చేసుకోండి. మీ ఇష్టదైవం ఎవరైతే వాళ్ళకి ఒక ఐదు నిమిషాలు ప్రార్థన చేసుకుని పడుకోండి. ఒకవేళ పగలు మీరు ఏదైనా పని తొందరలో ఉన్నా, సాయంత్రం పడుకునే ముందు మటుకి ఐదు నిమిషాలు ప్రార్థన చేసుకోకుండా మటుకి నిద్రపోకండి. ఏరోజుకారోజు మన మనస్సు పలుచబడుతుందా? చిక్క బడుతుందా? మన మనస్సు తేటగా ఉంటుందా? మురికిగా ఉంటుందా? అని మీలో మీరు విమర్శ చేసుకోండి. కానీ సాయంత్రం మటుకి మీ ఇష్ట దైవాన్ని ప్రార్థన చేసుకోకుండా మటుకు పడుకోకండి. ఎందుచేత

అంటే దీంట్లో ఒక రహస్యం ఉంది. దీని ప్రభావం రాత్రి అంతా ఉంటుంది. మీరు ఆరు గంటలు పడుకున్నారు అనుకోండి ఆరు గంటలు పనిచేస్తుంది. రాత్రి పడుకునేముందు మంచం ఎక్కేముందు ఒక ఐదు నిముషాలు ప్రార్థన చేసుకుంటే, నిద్రలో కూడా దీని ప్రభావం ఉంటుంది ఆరు గంటలు మీకు సాధన కలిసి వస్తుంది. ఇది మీరు అలవాటు చేసుకోవాలి పొద్దున్న కాఫీ ఎలా తాగుతున్నారో, సాయంత్రం పడుకునేటప్పుడు ప్రార్థన అలా habit చేసుకోవాలి.


ఇంద్రియాల తోటి అనుభవించే భోగాలు ఎటువంటివి అంటే ఇసుకలో పోసిన నూనె వంటివి అన్నారు. ఇసుకలో పోసిన నూనెకు ఎటువంటి గతి పడుతుందో, ఇంద్రియాల తోటి అనుభవించే భోగాలకి పర్యావసానం అది అన్నాడు. మనిషి భోగ జీవితం అనుభవించవచ్చు దానికి ఫలితం వస్తుంది. ఆ ఫలితాన్ని మళ్ళీ అనుభవిస్తావు. నేను కర్తను అని కనుక నువ్వు చేస్తుంటే, పుణ్యం చేస్తావు ఫలితం వస్తుంది, అనుభవిస్తావు. నువ్వు పొందిన అనుభవం నీకు ఏమి చేస్తుంది అంటే మళ్ళీ ఆ వస్తువుని సంపాదించాలి అని మనసు పురిగొల్పుతుంది కానీ నిజం వైపుకి నీ మనస్సు నిన్ను తీసుకు వెళ్ళదు. భోగ జీవితం యొక్క result అది అని భగవాన్ చెప్పారు.

**కృతి మహోదధౌపతనకారణం**
**ఫల మశాశ్వతం గతి నిరోధకం**

కృతి మహోదధౌ అది మహా సముద్రం. సంసార సముద్రంలో పడ్డ మనిషి ఇక లెగలేడు. అవతల ఒడ్డె కనపడదు వాడికి, భోగ జీవితంలో పడ్డవాడికి! ఏవండీ స్వామి మీరు ముష్టి ఎత్తుకున్నారు కదా సిగ్గు వెయ్యలేదాఅని ఎవరో భగవాన్‌ను అడిగారు. మీకు ఇంటింటికి వెళ్లి భిక్ష అడుగుతుంటే అన్నం అడుగుతుంటే సిగ్గు వెయ్యలేదా అని అడిగారు. నాకు సిగ్గు వెయ్యలేదు సరికదా, ఒక మహా చక్రవర్తిలాగ నాకు అనిపించింది అన్నారు భగవాన్. సిగ్గు ఎవరికి? అహంకారానికి సిగ్గు. కోపం ఎవరికి? అహంకారానికి. గర్వం ఎవరికి? అహంకారానికి. పొగరుబోతుతనం ఎవరికి? అహంకారానికి. అహంకారం ఏనాడో పాతాళలోకంలో కూరుకుపోయింది ఆయనకు. పొంగు అహంకారానికే, కుంగు అహంకారానికే. హెచ్చుతగ్గులు అన్నీ అహంకారానికే కానీ ఆత్మకు లేవు. అంటే భోగ జీవితం ఎటువంటిది? భోగ జీవితం మనం చేసుకున్న పుణ్యం వల్ల మనకి భోగ జీవితం వచ్చినప్పటికీ, ఏ వస్తువు వల్ల మనకి భోగ జీవితం వచ్చిందో, ఆ వస్తువుని మనం సంపాదించాలని మనసు ఉసికొల్పుతుంది కానీ భవిష్యత్ జన్మలలో కూడా నిజం తెలుసుకోవడానికి మనసు

ప్రయత్నం చెయ్యదు.

ఫల మశాశ్వతం ఫలితం అశాశ్వతమే కాదు, ఫలితం కొంతకాలం అనుభవిచాం అయ్యిపోయింది, ఖర్చు అయిపోయినా ఫరవాలేదు. గతినిరోధకం అంటే మోక్షం వైపుకి వెళ్ళకుండా భోగ జీవితం చేస్తుంది. మీరు చేసుకున్న పుణ్యం ఖర్చు అయిపోతే ఫరవాలేదు అంటున్నారు భగవాన్. ఖర్చు అయిపోయిఏమి చేస్తుంది అట మళ్ళీ అదే పుణ్యం, అదే భోగం అనుభవించడం కోసం మనసు ఉసికొల్పుతుంది కానీ నిజాన్ని తెలుసుకోవడానికి మనసు ప్రయత్నం చెయ్యదు. మిమ్మల్ని ఎవరు పలకరించటంలేదు అనుకోండి, మీతోటి ఎవరు స్నేహాలు చెయ్యటం లేదు అనుకోండి మీకు భయం వేస్తుంది మనల్ని ఎవరు పలకరించటం లేదు అని. ఎవరు మిమ్మల్ని పలకరించకపోతే మీరు అదృష్టవంతులు. ఏకాంతంగా సాధన చేసుకోవచ్చు. అసలు మాట్లాడటానికి ఏముంది? ఎక్కడ మాటలు లేవో, ఎక్కడ పాటలు లేవో, ఎక్కడ తలంపులు లేవో, ఎక్కడ ఊహలు లేవో, ఎక్కడ ఆలోచనలు లేవో, ఎక్కడ ఆదర్శాలు లేవో అక్కడ కదా ఆత్మ ఉంది. అక్కడ మాటలు లేవు, పాటలు లేవు. కబుర్లు కాకరకాయలు అక్కడకి వెళ్ళలేవు. ఎక్కడ ప్రకృతి లేదో అక్కడే ఉంది ఆత్మ. ఎక్కడ భయం లేదో, ఎక్కడ కామం లేదో, ఎక్కడ క్రోధం లేదో, ఎక్కడ ఇష్టం లేదో, ఎక్కడ అయిష్టం లేదో, ఎక్కడ దుఃఖం లేదో, అక్కడే ఉంది ఆత్మ. ఎక్కడ చీకటి లేదో, ఎక్కడ పగలు లేదో, అక్కడ ఆత్మ ఉంది. ఎక్కడ జన్మ లేదో, ఎక్కడ పునర్జన్మ లేదో, ఎక్కడ లోకం లేదో, ఎక్కడ దేహం లేదో, అక్కడే ఆత్మ ఉంది.



**ఆధ్యాత్మిక విద్య చాలా కష్టం అని అనుకుంటూ ఉంటారు. కష్టం, కష్టం అనుకోవటం కూడా ఒక అలవాటు. మన దైనందిన జీవితంలో జాగ్రత్తగా ఉంటే మనం తినే ఆహారం విషయంలో, మాట్లాడే మాటల విషయంలో జాగ్రత్తగా ఉంటే మనం ఏదైతే పొందాలి అనుకుంటున్నామో దానిని పొందుతాము. కంగారుపడనక్కరలేదు.**

త్యాగరాజు గారు ఒకమాట చెప్పారు ఈ శరీరం తాను కాదు అని వాడికి అర్థం అయితే వాడు ఇంక తపస్సు చెయ్యవలసిన అవసరం లేదు అని చెప్పాడు త్యాగరాజు. తనువు తాను కాదు అని తెలిసిన వాడికి ఈ జపమేలా? తపమేలా? వాడుదేనికోసం జపం చెయ్యాలి? దేనికోసం తపస్సు చెయ్యాలి? ఈ శరీరం తాను కాదు అని అర్థం అయినప్పుడు వాడు చెయ్యవలసిన జపం ఏముంది? తపం ఏముంది? ఈ దేహాత్మభావన పోగొట్టు కోవడానికే జపం, తపం, పూజలు ఇవన్నీ!

మీకు సుఖం వస్తే ఇది శాశ్వతంగా ఉండదు అనుకోండి, ఇది నిత్యము కాదు అనుకోండి, అలాగే మీకు కష్టం వచ్చింది అనుకోండి ఇది శాశ్వతం కాదు, ఇది నిత్యము కాదు అనుకోండి అప్పడు మనసు బాగుపడుతుంది. స్వామి వివేకానంద ఏమి చెప్పాడు అంటే ఎవరికైన సరే దానం చేస్తుంటే నువ్వు దానం చేసినందుకు గర్వపడకు. నువ్వు ఇవ్వడానికి వాడు నీకు అవకాశం కల్పిస్తున్నాడు. వాడు పుచ్చుకుంటేనే కదా నువ్వు ఇవ్వడం, వాడు పుచ్చుకోకపోతే నువ్వు ఎవడికి ఇస్తావు? అవకాశం కల్పించినందుకు సంతోషించు, గర్వపడవద్దు, వాడిపట్ల కృతజ్ఞత కలిగి ఉండు అన్నాడు. మీరు ఎవరికైనా దానం చేస్తున్నారు అనుకోండి వాడు పుచ్చుకుంటేనే కదా మీరు ఇచ్చేది, వాడు పుచ్చుకోకపోతే మీరు ఎవరికి ఇస్తారు? దశరథ కుమారుడు శ్రీరాముడు రాజ్యంలో, ఇచ్చేవాళ్ళే కానీ పుచ్చుకునే వాళ్ళు ఉండేవారు కాదట. సాత్విక దానం వల్ల వినయం వస్తుంది, మనసు బాగుపడుతుంది. గర్వం తోటి, అహంకారం తోటి చేసే దానం వల్ల మనస్సు చిక్కబడుతుంది. ఇంకా అజ్ఞానంలో కూరుకుపోతారు. మన ఉపనిషత్తులు రాసిన ఋషులు, వాళ్ళు రాసిన గ్రంథాలకి వాళ్ళ పేర్లు కూడా రాసుకోలేదు. ఎటువంటి మహాత్ములో చూడండి. వాళ్ళు గ్రంథాలు రాసి చివర వాళ్ళ పేరు కూడా రాసుకోలేదు, విషయం ప్రధానం కానీ ఎవరు రాస్తే ఏముందని పేరు కూడా రాసుకోలేదు. అదీ జ్ఞానం.

ఏమీ అక్కర్లేదు కుక్క ఎప్పుడైనా మిమ్మల్ని తరుముకు వస్తుంది అనుకోండి వెనక్కి తిరిగి ప్రశాంతంగా దాని కళ్ళలోకి చూడండి కుక్క ఆగిపోతుంది. లోకం కూడా కుక్క లాంటిది. లోకానికి మనం భయపడుతున్నాం అనుకోండి లోకం మనల్ని తరుముకు వస్తుంది. మనం భయపడకుండా లోకానికి ఎదురు నుంచుంటాం అనుకోండి, మనల్ని చూసి పక్కకి తప్పుకుంటుంది. మీరు భయపడే కొలది భయపెడతారు. మీరు ధైర్యంగా ఉంటే మీ జోలికి

ఎవడు రాడు, మిమ్మల్ని భయపెట్టరు, ఏవండీ మీరు కొంచెం భయపడుతున్నారు అనుకోండి ఇంకా ఎక్కువ భయపెట్టేస్తారు మిమ్మల్ని. మిమ్మల్ని కుక్క తరుముకు వస్తుంది అనుకోండి కంగారు పడి ఎక్కువ పరుగు పెడతారు అనుకోండి అదీ మీకంటే ఎక్కువ పరుగుపెడుతుంది. లోకం యొక్క తీరు అది, లోకం యొక్క పోకడ అది.

భారతదేశంలో ధనవంతులు చాలామంది ఎటువంటివారు అంటే మాకు ఇక్కడ నీరు లేదయ్యా బాబు నుయ్యి తవ్వి పెట్టమంటే అక్కడ ఎవ్వరు నుయ్యి తవ్వరు. గంగానది పక్కన కాశీలో తవ్వుతారు. గంగానది పక్కన నుయ్యి ఎందుకు? గంగానదిలో నీరు అందరూ తాగుతారు కదా! భారతదేశంలో ధనవంతులు అటువంటివారు అని నరేంద్రుడు చెప్పాడు. నీరు లేని చోట నుయ్యి తవ్వితే మంచిదా? పుణ్యం వస్తుంది అని గంగానది పక్కన నుయ్యి తవ్వితే మంచిదా? మీరు మోక్షం కావాలి, మోక్షం కావాలి అని అనుకుంటున్నారు. కానీ మీరు ఇప్పుడు ఉన్నది మోక్షంలోనే ఉన్నారు. మోక్షంలో లేరు అనుకోండి, ఎక్కడ ఉన్నారు మరి? మనం మోక్షంలోనే ఉన్నా అది మన అనుభవంలోకి రాకుండా ద్వైత ప్రపంచం అడ్డు వస్తోంది అంటే తెర కింద అడ్డు వస్తుంది. ఆ తెర తొలగించడం మనం చెయ్యవలసిన పని. మీరు అందరూ మోక్షంలోనే ఉన్నారు. మీ పేరు ఎల్లమ్మ అని, పుల్లమ్మ అని, సుబ్బమ్మ అని అలా కాదు మీ పేరే మోక్షం. మీలో ఎవరైనా మనం ఇప్పుడు మోక్షంలో లేము అనుకుంటున్నారు అనుకోండి పోనీ ఎక్కడున్నారో చెప్పండి? సోదరమహాశయులారా! మనం ఆత్మ విచారణ చేయాలి, లోక విచారణ కాదు. మనం లోకవిచారణ చేస్తున్నాం, లోకవిచారణ చేస్తూ అది ఆత్మవిచారణ అనుకుంటున్నాం. చేసేదేమో లోకవిచారణ, కానీ ఆత్మవిచారణ అనుకుంటున్నాం ఇంక ఆత్మ ఎలా అనుభవంలోకి వస్తుంది?

మీరు ఎప్పుడైనానిష్కామ కర్మ చేసి ఉంటే అందులో ఉన్న కష్టం మీకు తెలిసి ఉండేది. మీరు సేవ కాదు పూజ చెయ్యాలి. మీరు ఎవరికైనా ఉపకారం చేస్తే అది సేవ అనుకోకండి పూజ అనుకోండి. అలా అయితే మీరు బాగుపడతారు. ఎవరైనా ఒక వ్యక్తికి మీరు అన్నం పెట్టారు అనుకోండి వాడికి ఉపకారం చేస్తున్నాం, సేవ చేస్తున్నాం అనుకోకండి. వాడికి అన్నం పెట్టి వాడికి పూజ చేస్తున్నాం అనుకోండి. దేవుడి దగ్గర పువ్వు పెడుతున్నాం అనుకోండి ఉపకారం చేస్తున్నాం అనుకుంటున్నారా? మీ హృదయంలో ఏ తలంపులు అయితే బలీయంగా ఉన్నాయో ముందు చూసుకోండి. చూసి వాటి బలం ఎంత ఉందో

అంచనా కట్టుకోండి. తరువాత వాటి బలం తగ్గించుకుంటూ రండి. ఇంతకంటే మించిన సాధన లేదు. అవి పడిపోతే అక్కడే ఉంది ఆత్మ. మీ తలంపులకు ఎంతో కొంత బలం ఉంది, ఆ బలమైన తలంపు మీకు సుఖం రానివ్వడం లేదు, శాంతి రానివ్వడం లేదు. ఆరోజుకారోజు మీ వాసన యొక్క బలాన్ని తగ్గించుకుంటూ వస్తే, అది పలుచబడిపోయి రాలిపోతుంది. నిజమైన భక్తుడే జీవన్ముక్తుడు, నిజమైన భక్తుడే గుణాతీతుడు. భక్తుడు భక్తుడు అంటే ఏమీ లేదు నిరంతరం తన మనస్సుని ఎవడైతే భగవంతుడి మీద పెట్టి ఉంచుతున్నాడో వాడే భక్తుడు.

మిమ్మల్ని ఎవరూ తరుముకు రావడం లేదు, మీరు ఏమీ కంగారు పడకండి. మీ హృదయంలో ఏముందో పరిశీలించి చూసుకోండి, పరిశీలించండి, పరిశోధించండి. సెర్చ్ అండ్ రీసెర్చ్. ఈ సంస్కారం ఎప్పుడు వచ్చింది? ఎక్కడ వచ్చింది? ఏ జన్మలో ఈ దోషం ప్రారంభం అయ్యింది? ఈ లెక్కలు వద్దు అన్నాడు గౌతమ బుద్ధుడు. మీ కాలులో ముల్లు దిగితే ఆ ముల్లు తీసేయడానికి ప్రయత్నం చెయ్యండి. ఆ ముల్లు పాలకొల్లులో దిగిందా, జిన్నూరులో దిగిందా ఆ లెక్కలలోకి వెళ్ళద్దు అన్నాడు. అది టైం వేస్ట్ అన్నాడు. మీకు జ్వరం వచ్చింది ఆ జ్వరం తగ్గించుకోవడానికి ప్రయత్నం చెయ్యండి. ఏ వాసన అయితే మీకు దుఃఖాన్ని తీసుకు వస్తుందో, ఆ వాసన వేరుతో సహా నశించాలి. ఆకులు, రొబ్బలు తెంపేసి వేరు కనుక మీరు బయటకి లాగకపోతే, ఈ జన్మలో కాకపోతే మరొక జన్మలో మళ్ళీ అది చిగురిస్తుంది. అలాగే మీలో ఉన్న వాంఛని వేరుతో సహా తొలగించకపోతే, ఆ మొదలు అక్కడే ఉండిపోయి, అనుకూలమైన పరిస్థితులు వచ్చినప్పుడు మళ్ళీ అది చిగురించి విజృంభిస్తుంది అని చెప్పాడు. మీరు ఏకాంతంగా కూర్చున్నప్పుడు మిమ్మల్ని ఏ సంస్కారాలు అయితే బాగా దుఃఖ పెడుతున్నాయో చూసుకోండి. సంస్కారం అంటే ఏమీ లేదు. వాసన అంటే ఏమీ లేదు. మన అలవాటు రిపీట్ చేసే కొలది అది వాసన కింద వస్తుంది. ఆ వాసన మనం పోగొట్టుకోలేదు అనుకోండి శరీరం మారటం వలన వాసన చావదు. ఆ వాసన ఉన్నంతకాలం నిజం తెలియదు. శాస్త్రం చదివినా అర్థం కాదు. మీరు భగవద్గీత వెయ్యి సార్లు చదవండి లోపల వాసన ఉంటే అది అర్థం అవ్వదు, ఎందుచేత? మీరు అనుకున్నది భగవద్గీతలో కనిపిస్తుంది కానీ, భగవద్గీతలో ఉన్నది మీ మనస్సుకి అందదు లోపల వాసన ఉంటే, ఆ వాసన తెలియనివ్వదు.

ఒకరు భగవాన్ దగ్గరకి వచ్చి, ఆ లోకం ఇలా ఉందండి, ఈ లోకం అలా ఉంది, ఆ మహాత్ముడు ఇలా ఉన్నాడు, ఈ మహాత్ముడు అలా ఉన్నాడు అని ఏదో చెబుతున్నాడు. ఎదురుగా ఉన్నవాడు ఎవడో నీకు తెలియటం లేదు, ఇంక ఆ లోకం గురించి నీకేమి తెలుస్తుంది అన్నారు భగవాన్. కళ్ళకి కన్పించేదే అర్థం కానప్పుడు కళ్ళకు కనపడనిది ఎలా అర్థం అవుతుంది? చెవుల తోటి విన్న మాటే అర్థం కానప్పుడు విననిది ఎలా అర్థం అవుతుంది? దీపం ఉన్నప్పుడే చదువుకోమంటే చదువుకోకపోతే దీపం ఆరిపోయిన తరువాత చదువుకునేది ఏమిటి? శివ స్వరూపం అంటే ఏమిటో అనుకోకండి. మంగళ స్వరూపం. ఆత్మ స్వరూపమే శివ స్వరూపం. ఆత్మ స్వరూపమే శాంతి స్వరూపం. ఆత్మ స్వరూపమే కాంతి స్వరూపం. ఆత్మ స్వరూపమే మంగళ స్వరూపం. ఆత్మని విడిచి పెట్టి ఏ వస్తువు లోంచి మీరు సుఖాన్ని పొందుతున్నప్పటికీ అది తప్పనిసరిగా దుఃఖం తీసుకొచ్చి తీరుతుంది. ఆచార్యుల వారు ఇదంతా కల్పితం అంటున్నారు కదా, ఇది కల్పితం అని నిజంగా మన హృదయానికి తట్టినప్పుడు ఇంక సాధనతో పనేముంది చెప్పండి. ఇది అబద్ధం అని మీ హృదయానికి తెలిస్తే అసలు మనస్సు బహిర్ముఖం అవుతుందా? బహిర్ముఖం అవుతుంటే కదా సాధన చెయ్యటం. నా మనస్సు నిలకడగా ఉండటం లేదు, నా మనస్సు కదిలిపోతోంది అని ఒకడు భగవాన్‌తో అంటే ఆయన ఏమన్నారు అంటే నీ మనస్సు కదలకుండా ఉండమని చెబుతున్నా అది కదులుతోంది, నా మనస్సుని కదులు అన్నా కదలటం లేదు. అది ఎక్కడ కదులుతుంది? మన మనస్సు కదులుతోంది కాబట్టి మనకి సాధన చెప్పారు. భగవాన్ తన మనస్సుని కదులు, కదులు అంటున్నారు అట, అది ఎక్కడైనా కదిలితే కదా ఆ మనస్సు. ఏముంది కదలడానికి? విషయాన్ని అర్థం చేసుకోవటం కూడా ఒక యోగమే. అర్థం చేసుకోవడానికి మించిన యోగం లేనే లేదు. ఇది కష్టం అని అనుకోవటంలో కష్టం

**ఎదుటివాళ్ళు కష్టపడుతుంటే అది చూసి నీకు సంతోషం కనుక కలుగుతుంటే, నీ మనస్సులో హింసాప్రవృత్తి ఉన్నట్లే.**



ఉంది. చేస్తే తగ్గిపోతుంది. పని మొదలు పెడితే పని తరుగుతుంది కానీ, పని మొదలు పెట్టకుండా పని ఎక్కువగా ఉంది, పని ఎక్కువగా ఉంది, అంటే పని ఏమి తరుగుతుంది? పని తరగదు. పని మొదలు పెట్టండి తరిగిపోతుంది.

భగవంతుడు అనుగ్రహం మీ మీద నిజంగా ఎప్పుడు ఉన్నట్టు అంటే ఇది బాగా జ్ఞాపకం ఉంచుకోండి హృదయంలో ఉన్న సత్యాన్ని మనం దర్శించాలి, మన హృదయంలో ప్రకాశిస్తున్న భగవంతుడిని మనం తెలుసుకోవాలి అనే బలీయమైన వాంఛ మీకు కలుగుతోంది అంటే నిజంగా ఈశ్వర అనుగ్రహం మీ మీద ఉన్నట్టే! అది తప్పించి ఈ లోకానికి సంబంధించి కోరిక కానీ పరలోకానికి సంబంధించిన కోరిక కానీ ఏది వచ్చినప్పటికీ ఈశ్వర అనుగ్రహం మీకు లేనట్టే! మన పరిస్థితి ఎలా ఉందంటే, మనం అనుకునేవి ఏమో నిజం కాదు. నిజం మనకి తెలియదు. ఆ పరిస్థితుల్లో ఇప్పుడు మనం ఉన్నాము. నిజం తెలిస్తేనే కానీ బంధం నుంచి విడుదల పొందలేము. మీరు ఒంటరిగా కూర్చొని ఈ ప్రశ్న వేసుకోండి. నాకు మోక్షం కావాలి అని కోరుకుంటున్నాను. ఆత్మని తెలుసుకోవాలి అని కోరుకుంటున్నాను. సత్యాన్ని తెలుసుకోవాలి అని కోరుకుంటున్నాను కానీ ఇప్పుడు నేను ఎవరిని? నేను ఎవరిని?

ఈశ్వరుడి మీద మీకు ప్రీతి కలగాలి. మీ హృదయంలో తపన వల్ల భక్తి వస్తుంది కానీ డబ్బు వల్ల భక్తి రాదు. మీ చదువు వల్ల భక్తి రాదు. మనసుని నిగ్రహించుకోవాలి, ఎలా నిగ్రహించుకోవాలి అని కొంతమంది అడుగుతారు. అసలు మనసు ఏమిటి? ఎలా ఉంది? ఎప్పుడైనా చూశారా మనస్సుని? మీ మనస్సుని మీరు ఎప్పుడైనా చూసుకున్నారా అని అడుగుతున్నాను. అసలు ఉంటే కదా మీరు చూడడానికి, మీకున్న వాసనే మనస్సు కింద వస్తుంది. మీకున్న కోరికే మనస్సు కింద వస్తుంది. మనస్సు అనేది ప్రత్యేకంగా లేదు. లేనప్పుడు మీరేమి చూస్తారు? అది ఉంటే కదా మీకు కనపడటానికి, మీ సంస్కారాలు పడిపోయాయి అనుకోండి. మీ వాసనలు పడిపోయాయి అనుకోండి మీ కోరికలు పడిపోయాయి అనుకోండి మనసు పత్తా లేకుండా పోతుంది.

జీవితాన్ని సమన్వయం చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యాలి. ఈ శరీరం మనకివంతెన లాంటిది. మనకి ఉపయోగపడుతుంది. శరీరం పడిపోయిన తరువాత మనం చేసేది ఏమీలేదు. వంతెన పడిపోయాక ఇవతల ఒడ్డు నుంచి అవతల ఒడ్డుకి


చేరుకోలేము. మరణించే శరీరం ఉండగానే, మరణం లేని ఆత్మని దర్శించిన వాడు జ్ఞాని. వాడు ఆవల ఒడ్డుకి చేరుకుంటాడు. ఈ మరణించే శరీరంలో, మరణించని వస్తువు ఒకటి ఉంది, అమృత వస్తువు. ఈ శరీరం ఉండగానే దానిని దర్శించిన వాడే జ్ఞాని, దానిని దర్శించిన వాడే మోక్షానికి అధిపతి.

చాలామంది ఉద్దేశ్యం ఏమిటి అంటే మరణించిన తరువాత మోక్షం వస్తుంది అని అది అబద్ధం. ఇప్పుడు పొందలేనిది మరణించాక రాదు, రాదు. మనం పొందేది ఏదో శరీరం ఉండగానే పొందాలి. ఈ శరీరం ఉండగా మనం ఏ స్టేట్ వరకు పొందామో ఆ స్టేట్ నిలకడ అవుతుంది కానీ మరణించిన తరువాత అదనంగా రాదు. సోదరమహాశయులారా మీరు ఇంటివద్ద తినే అన్నం ఎటువంటిదో నేను మీకు చెప్పే మాటలు కూడా అటువంటివే. మీరు ఇంటివద్ద అన్నం తింటున్నారు. అన్నం తినడం వల్ల శరీరాలు నిలబడి ఉన్నాయి. అయితే నేను చెప్పే మాటలు దేనికి అన్నం? నేను చెప్పే మాటలు మీ మనస్సుకి అన్నం. మీ ఇంటివద్ద తినే అన్నం ఎంత అవసరమో, నేను చెప్పే మాటలు కూడా అంతే అవసరం. నేను చెప్పే మాటలు మీ మనస్సుకి అన్నం. మీరు ఇంటివద్ద తినేది మీ శరీరానికి అన్నం. జీర్ణం చేసుకోవడానికి ప్రయత్నం చేయండి. మీరు ఇంటివద్ద తిన్న అన్నం జీర్ణం అయితే మీకు ఎంత ఆరోగ్యాన్ని ఇస్తుందో, నేను చెప్పే మాటలు మీరు అర్థం చేసుకుంటే అవి మీ మనసుకి ఆరోగ్యాన్ని ఇస్తాయి.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **520101264185724** **(IFSC Code : UBIN0916137)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# అరుణాచల మహాత్మ్యం
# అక్షరమణమాల

సేకరణ: రాజేశ్వరి గారు, హైదరాబాదు

**ఊరూరు తిరుగక ఉల్లము నిను గని**

**అణగ నీ ధ్యుతి చూపు అరుణాచలా! ॥8॥**

తాత్పర్యం: లోక విషయాలను మరిగి జన్మల తరబడి ఊరూరు తిరుగుతున్న నా మనస్సు, నిన్ను చూసేవరకూ అణగదు. కనుక నీ సుందర చైతన్య సుఖ స్వరూపాన్ని ఒక్కసారి నాకు చూపించు అరుణాచలా!

ఓ అరుణాచలేశ్వరుడా! మనస్సుకి చాపల్యం సహజం కదా. గాలికి ఆకులు అటూ ఇటూ కదులుతాయి. అలాగే విషయ చింతన వచ్చేసరికి మనస్సు అటూ ఇటూ కదులుతా ఉంటుంది. మనము ఆత్మ చింతన చెయ్యటం లేదు, విషయ చింతన చేస్తూ, లోక విచారణ చేస్తూ ఆత్మ విచారణ చేస్తున్నామని అనుకొంటాము. సత్సంగాలలో కూడా అంతే, చేసేది లోక విచారణ కానీ ఆత్మ విచారణ చేస్తున్నామనుకొంటున్నాము.

భగవాన్ ఏమంటున్నారు అంటే, ఊరూరు తిరుగక ఊరూరు తిరుగక ఉల్లము నినుగని అణగ నీ ధ్యుతి చూపుము అరుణాచలా. ఈ ఊరు అని ఆ ఊరు అని, ఈ ఇల్లు అని ఆ ఇల్లు అని, ప్రపంచాన్ని పట్టుకొని తిరుగుతున్నాము. నిన్ను పట్టుకొని తిరగటం లేదు. కొంతమందికి చపలత్వం ఎక్కువగా ఉంటుంది, రోజుకో మార్గం, రోజుకో గురువు, వాళ్ళకి స్థిరత్వం ఉండదు. స్థిరబుద్ధి లేనివాళ్ళకి ఒక మార్గం మీద నమ్మకం ఉండదు. వాళ్ళు విశ్వాసహీనులు.

ఊరూరు తిరుగక ఊరూరు తిరుగక ఉల్లము నినుగని అణగ నీ ధ్యుతి చూపుము

- నీ వైభవం చూపిస్తే, నా మనస్సు వెళ్ళి అక్కడ అణిగిపోతుంది. సముద్రంలో ఎంత నీరు ఉందో, మీ హృదయంలో అంత సుఖం ఉంది, శాంతి ఉంది, అంత ఆనందం ఉంది. అరవింద్ ఘోష్ గారి భాషలో, నీ హృదయంలో ఉన్నది -'ది కామ్, ది లైట్, ది పవర్, ది బ్లిస్స్, ది ఫ్రీడం, ది వైడ్నెస్స్, ది హైట్స్ ఆఫ్ నాలెడ్జ్, అండ్ ది సీస్ ఆఫ్ ఆనంద'! ఇప్పుడు నీ హృదయం మూసుకుపోయి ఉంది, అది ఓపెన్ అవ్వలేదు కాబట్టి నీకు తెలియటం లేదు, దానిని మేలుకొల్పాలి. ఈశ్వరానుగ్రహం, గురువు అనుగ్రహం లేకుండా అది మేల్కోదు. ఎప్పుడైనా మీకు మేల్కొనే పరిస్థితి వచ్చినప్పుడు, నదికి వరద వచ్చినప్పుడు ఎంత వేగంగా వస్తుందో, అలా ఆ హృదయంలో ఉన్నటువంటి ఆనందం మీ సహస్రారాన్ని ముంచేస్తుంది. అప్పుడు మీ మాట పడిపోతుంది. మీ సహస్రారమంతా ఆనందం తోటి శాంతితోటి కాంతి తోటి నిండిపోతుంది.

మీ హృదయంలో ఉన్న శాంతి మీకు దొరికినప్పుడు ఆ సుఖం మీకు అనుభవంలోకి వచ్చినప్పుడు ఏమనిపిస్తుంది అంటే, మనకి సుఖం, శాంతి లేదు అనుకొన్నాము, ఇది ఇప్పుడు భరించలేక పోతున్నాము ఎలాగ అనిపిస్తుంది! మీకు సర్ప్లస్ (surplus) అయిపోతుంది. ఆ ఆనందాన్ని మీరు భరించలేరు. భరించలేనప్పుడు మీకు స్పీడ్ తగ్గిస్తాడు. మళ్ళీ భరించే శక్తిని ఇస్తాడు. అప్పుడు మీరు ఆనందాన్ని అనుభవించటం కాదు, మీరే ఆనందం అయిపోతారు.

ఊరూరు తిరుగక ఊరూరు తిరుగక ఉల్లము నినుగని అణగ నీ ధ్యుతి చూపుము - ఉల్లము అంటే మనస్సు. మనస్సు ఇంద్రియాలు వాటంతట అవి అణగవు, ఎప్పుడు అణిగిపోతాయి అంటే, మన మనస్సుకి ఆయన వైభవాన్ని చూపించినప్పుడు, ఆయన యొక్క గ్రేస్ ని, ఔన్నత్యాన్ని చూపించినప్పుడు, మనస్సు ఇంద్రియాలు అణిగిపోతాయి, అంతే కదా! ఇప్పుడు మీ చేతిలో ఒక రూపాయి ఉంటే, నాకు ఇవ్వమంటే ఇవ్వరు. నేను పది రూపాయలు ఇస్తాను, ఆ రూపాయి ఇవ్వమంటే ఇచ్చేస్తారు. అలాగే మీ బుద్ధికి మీ ఇంద్రియాలకి మీ మనస్సుకి అతీతమైన శక్తి మీకు అనుభవంలోకి వచ్చినప్పుడు ఇవి ఆటోమేటిక్ గా పడిపోతాయి. అప్పుడు మనస్సుకి, ఇంద్రియాలకి వాండరింగ్ ఆగిపోతుంది.

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

SRI RAMANA KSHETRAM A/c. No. 6794857762
INDIAN BANK, VEDANGIPALEM BRANCH
IFSC Code : IDIB000V142, Contact No. 9866715896

# భగవాన్ శ్రీ రమణమహర్షి

భగవాన్ శ్రీరమణమహర్షి తమిళనాడు రాష్ట్రంలోని మధురైకి దగ్గరలో తిరుచ్చుళి గ్రామంలో అళగమ్మ, సుందరం అయ్యరు, పుణ్యదంపతుల ద్వితీయ పుత్రుడిగా ది॥ 30-12-1879న జన్మించారు. తరువాత కాలంలో తన 17వ ఏట, మధురైలో ఆయనకు కలిగిన మరణానుభవం ద్వారా, నిజమైన పునర్జన్మనెత్తారు, అహంకారం నశించి తాను బ్రహ్మమయ్యారు! పిమ్మట ది॥ 01-09-1896న ఆ ఉపాధి పవిత్ర అరుణాచలం చేర్చబడింది. అప్పటినుండి తాను శరీరం విడిచిపెట్టేవరకూ ఏబది నాలుగు సంవత్సరములు, జీవన్ముక్తునిగా అరుణాచల క్షేత్రములో సంచరించిన కాలంలో, దేశ, విదేశాల నుండి అనేకమంది జిజ్ఞాసువులు ఆయన బోధపట్ల ఆకర్షితులయ్యారు. ఆయన బలమైన ఆధ్యాత్మిక అయస్కాంతం! భగవాన్ విరూపాక్ష గుహలో ఉండగా, 1912 సం॥లో భక్తులు ఆయన యొక్క మొదటి పుట్టినరోజును జరుపుకోవడం జరిగింది. జనన - మరణ సంసార చక్రము నుండి విడుదల పొంది, ఆత్మ సామ్రాజ్యానికి అధిపతియైన భగవాన్ శ్రీరమణునికి, పుట్టినరోజు అనే మాటకు అర్థం ఏముంటుంది? తాను అనంతుడు, అసలు పుట్టుకే లేనివాడు. కానీ మహాత్ముల పుట్టిన రోజులు జరుపుకోవడం మనము పవిత్రులమవడానికే! మన మనస్సు, బుద్ధి, వికసించటానికే! రమణుడు పూర్ణుడు, కాలాతీతుడు, కాబట్టి ఆయన దేహము పుట్టినరోజు మనకు పర్వదినమే కాదు, మన జీవన మార్గాన్ని నిర్ణయించుకొనే రోజు. సకల జీవరాశిలోనూ ఒకే చైతన్యం వ్యాపించి ఉందనే సత్యాన్ని నిరూపిస్తూ, తన దగ్గరకు వచ్చిన ఆవును, కోతులను, పాములను, అట్లే సకల జంతువులు, క్రిమికీటకాదులను, ఆత్మదృష్టితో చూసేవారు. వారి సమభావన సర్వ శ్రేష్ఠమైనది. పుస్తక పాండిత్యము, బాహ్య సాధనలు, వీటికన్నా అంతర్ముఖులమై, మనోమూలములకి వెళ్ళి తనను తాను తెలుసుకొనుటద్వారా, తానే - ఆత్మ అనెడి సత్యాన్ని కనుగొనగలడని చెప్పారు. 'నిన్ను నీవు తెలుసుకో' అన్నదే భగవాన్ బోధాసారము. కల్పిత అజ్ఞానం కారణంగా దేహమే - నేను అని భావించి, జనన - మరణ సంసార చక్రంలో చిక్కుకుని, దుఃఖించే మానవాళికి, తన జీవిత విధానము, ప్రవర్తన, బోధ ద్వారా, జన్మరాహిత్యానికి మార్గం చూపారు. ఈ భూమిమీద నడచిన పరమాత్మ ప్రతిరూపమే భగవాన్ శ్రీరమణమహర్షి.

- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064

# రాధా మాధవుల వివాహ వైభవం కమనీయం

రాధ ఎవరు? ఈ ప్రశ్నకు 'వ్రజ భాగవతం' రమ్యంగా అభివర్ణించిది. లాక్షణికులు రసాలు తొమ్మిదంటారు. రాధాకృష్ణుల విరహ భూమి 'బృందావనం'. శ్రీకృష్ణుడే స్వయంగా "నన్ను చేరటానికి రాధను ధ్యానం చెయ్యకుండా ఎవరూ నా కృపను పొందలేరు" అన్నారు. రావల్ గ్రామం బృందావనం సమీపంలో ఉంది. కీర్తిదేవి, వృషభానులకు రాధ జన్మించింది. అది భాద్రపద శుద్ధ అష్టమి. ఆ బాలికను చూసిన నారదుడు స్పృహ తప్పి పడిపోయాడు. తదుపరి గోకుల నాయకి అని గుర్తించారు. రాధ పుట్టిన తరువాత ఎవ్వరినీ చూడలేదు. యశోదమ్మ కన్నయ్యను చంకన పెట్టుకొని రాగా రాధ మొదట కన్నులు తెరిచి చూసింది. రాధ తులసికి పంచామృతాలతో అభిషేకం చేస్తే ఆమె (తులసి) ప్రత్యక్షమై "నీవు లోకేశ్వరుని భార్య అవుతావు. మీ పెళ్లికి బ్రహ్మదేవుడే పురోహితుడు" అనగా అలాగే జరిగింది. రాధా దేవిని రసేశ్వరిగా భావిస్తారు. జయదేవుల అష్టపదుల రమ్యం చాలామంది రాధ ఒక గోపిక అనే అనుకొంటారు. అది తప్పు. గీత గోవింద కావ్యము శ్రీజయదేవ కవీంద్రుని అపూర్వ సృష్టి. సంస్కృత సాహిత్య సరస్వతికి అమూల్యమైన యమకాలంకారంతో శబ్దలాలిత్యం, అర్థ సౌకుమార్యం, అందంగా సమ్మిళితమైన రమణీయ కృతి. ఇది మధుర భక్తి మయమైన ఈ రూపకం క్రీ॥శ॥ 12వ శతాబ్ది ఉత్తరార్థంలో పూరీ జగన్నాథ క్షేత్రంలో ఆవిర్భవించింది. ఈ యితివృత్తాన్ని 24 అష్టపదుల్లో మనోజ్ఞంగా విస్తరించి ఈ నృత్య రూపకాన్ని రచించి ఇలవేల్పులైన పూరీ జగన్నాథ స్వామికి సమర్పించారు. ఆ స్వామి సన్నిధిలో అష్టపదులు ఆలపిస్తుండగా ఈయన ధర్మపత్ని పద్మావతి ఒక మహారాజు కూతురు జయదేవుల గానానికి పరవశించి ఆయనను వివాహం చేసుకుంది. ఆయా గేయాల్లోని భావాలకు అనుగుణంగా అప్పటికప్పుడు అభినయిస్తూ ఉండేది. 19వ అష్టపది ప్రియే చారుశీలే చరణాన్ని శ్రీకృష్ణుడు మన్మథ తాపంతో బాధపడుతూ ఆ తాపాన్ని ఉపశమింప చేసుకోవటానికి తన తలపై రాధ చిగురుటాకులవంటి కోమలమైన ఆమె పాదాలను ఉంచమని ప్రాధేయపడినట్లు జయదేవులు వ్రాసి భగవంతుని తలపై రాధ పాదాలు ఉంచటం అనుచితమని తలచి వ్యాకుల మనస్సుతో కొట్టివేసాడు. జయదేవులు అభ్యంగన స్నానార్థమై నదికి వెళ్ళి వచ్చేసరికి తాను మొదట వ్రాసిన పదాలే తిరిగి వ్రాయబడి ఉండటం, తన భార్య ద్వారా జరిగిన విషయం తెలుసుకొని అమితానందం పొందాడు. శ్రీకృష్ణ దర్శన భాగ్యం అయింది కాబట్టి ఈ అష్టపదిని 'దర్శనాష్టపది' అంటారు. ఖజురహో దేవాలయంలో 108 రతి క్రీడల వైభవాన్ని నునుపు నల్లరాతిపై చెక్కబడింది. వత్సరాయణ మహర్షి ఆధ్యాత్మిక సాధకులకు ఆ భంగిమలను చూపుతూ మనస్సు ఏకాగ్రమైనప్పుడు, మనస్సు ధ్వంసమైనప్పుడు విగ్రహాలు లేకుండా ఖాళీగా ఉన్న గుడిలోకి తీసుకొని వెళితే సాధకుడు ఆత్మానందం పొందుతాడు. ఆధ్యాత్మిక చరిత్రలో ఒక స్వామి వేయి గోవులు అయిన తరువాత సిద్ధి పొందాడు. శ్రీనాన్నగారు "శ్రీకృష్ణుని చూడగానే రాధకు ఒంటి మీద గుడ్డ లేదనే స్పృహ కూడా కలిగేది కాదు. రాధ అసలు లేదు సాధన ఎలా ఉండాలో తెలపటానికి ఆమెను తనే జయించుకొన్నాడు. తన స్వరూపమే రాధ" అన్నారు. జయ జనార్ధనా రాధికా పతే నంద నందన రుక్మిణి పతే సత్యం రాధే. మొదటి భార్యపై రాధ భంగిమను వ్రాయటానికి సాధ్యం కాదు. సభ్య ప్రపంచం భరించలేదు, తట్టుకోలేరు. అది అంతే. కామం కూడా కళే, ధర్మపరమైన కామం తప్పు లేదు. ప్రతీ దేవాలయం వెనుక ప్రక్కల కామ భంగిమలు ఉంటాయి.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966